
సాగునీటి సంఘాల ఎన్నికలకు

గ్రీన్‌సిగ్నల్

- డిసెంబరు 5న నోటిఫికేషన్‌.. 8న ఎన్నికలు
- జిల్లాలో 167 చెరువులు.. ఓటర్ల జాబితా సిద్ధం
- పెద్దేరు, బాహుదా సహా మూడు పెద్దచెరువులు
- ఒక్కో ఎన్నికకు 14 మంది అధికారుల నియామకం
- సామరస్యపూర్వక ఎన్నికకే ప్రభుత్వం మొగ్గు


ఎన్నికలు జరగనున్న మదనపల్లె మండలంలోని ఓబుల్‌నాయునిచెరువు


నిమ్మనపల్లెలోని బాహుదా ప్రాజెక్టు

మదనపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్ర భుత్వం గ్రీన్‌సిగ్నల్‌ ఇచ్చింది. ఇందులో భాగం గా వచ్చే నెల 5న నోటిఫికేషన్‌ వెలువ డనుండగా, 8న ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలో మొత్తం 3,276 చెరువులు ఉండగా, అందులో వంద ఎకరాలు, ఆపై విస్తీర్ణం ఉన్న 167 చెరువులకు మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మొత్తం ఆరు టెరిటోరియల్‌ కాన్‌స్టిట్యుయన్సీ (టీసీ)ల నుంచి చైర్మన్‌, వైస్‌చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. ఇప్పటికే ఇరిగేషన్‌, రెవెన్యూ శాఖ సంయుక్తంగా ఆయకట్టు రైతుల జాబితా సిద్ధం చేయగా, వారి నుంచి భూమిశిస్తు వసూళ్లపై రెవెన్యూ శాఖ కసరత్తు చేస్తోంది. ఇంత కు ముందే ఈనెల 23న ఎన్నికలు నిర్వహిం చాల్సి ఉండగా అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండటంతో సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసింది. ఈ క్రమంలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించి జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట రెవెన్యూ డివిజన్లలో మాస్టర్‌ ట్రైనర్స్‌ అధికారులు, సిబ్బందికి శిక్షణ పూర్తి చేశారు.

జిల్లా వ్యాప్తంగా జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలను ఎలక్షన్‌ కాకుండా వీలైనంత వరకూ సెలక్షన్‌ పద్ధతిలో నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న 14 మంది ఎన్నికల అధికారులు, అసిస్టెంట్‌ ఎన్నికల అధికారి, సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో శిక్షణ అధికారులు సైతం ఇదే అంశాన్ని శిక్షణ సమావేశాల్లో నొక్కి చెప్పారు. పార్టీలకతీతంగా, అందులోనూ ఆయకట్టు రైతుల మధ్య జరిగే ఎన్నికలు కావడంతో ప్రశాంతమైన వాతావరణంలో వారి మధ్య ఎలాంటి పొరపచ్చాలు, వివాదాలు లేకుండా పూర్తి చేయాలన్నది అందులోని ప్రధానాంశం. విధిలేని పరిస్థితిలో ఎక్కడైనా రైతుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే పోటీదారుల నుంచి రైతులు (ఓటర్లు) చేతులెత్తి టీసీని ఎన్నుకోవడం, అదీ లేకుంటే స్లిప్పులు ఇచ్చి ఓటు వేసే విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ ప్రక్రియ మొత్తం ఒకేరోజు డిసెంబరు 8నే పూర్తి చేయాల్సి ఉంది. అప్పటికీ ఏకాభిప్రాయం లేకుంటే వాయిదాపడుతుందని చెబుతున్నారు.

ఒక్కో చెరువు కింద వంద ఎకరాలు, ఆపై విస్తీర్ణం ఉన్న చెరువులు ఎన్నికల జాబితాలో ఉన్నాయి. వీటి కింద కనిష్ఠంగా వందమంది రైతుల నుంచి వెయ్యి మందికిపైగా ఆయకట్టు రైతులు (ఓటర్లు) ఉన్నారు. సెంట్లలో విస్తీర్ణం నుంచి 25 ఎకరాలు ఉన్న రైతులు కూడా ఉన్నారు. ఇక్కడ ప్రధానంగా ఓటర్లతో కాకుండా చెరువు కింద ఉన్న ఆయకట్టును ఆరు టీసీలుగా విభజిస్తారు. ఈ క్రమంలో ఒక టీసీలో ఒక రైతు నుంచి వంద మందికిపైగా రైతులు ఉంటున్నారు. ఉదాహరణకు తీసుకుంటే.. తంబళ్లపల్లె మండలం రేణుమాకులపల్లెలోని బాలిరెడ్డిచెరువు కింద ఓ రైతుకు 22 ఎకరాలు భూమి ఉండగా, ఆయన పరిధిలోకి వచ్చే టీసీలో ఆయనే ఒకే రైతుగా నమోదయ్యారు. చెరువుకు దిగువభాగంలో మూడు టీసీలను, దాని తర్వాత ఆయకట్టును మూడు టీసీలుగా విభజించారు. ఎన్నికల్లో మాత్రం ఆరు టీసీ మెంబర్లు ఎన్నికైతే, మొదట్లోని మూడు టీసీల్లో ఒకరు చైర్మన్‌ అయితే, దాని కింద భాగంలోని మూడు టీసీల్లో వైస్‌చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుంది.

జిల్లాలోని చెరువులతో పాటు తంబళ్లపల్లె మండలం పెద్దేరు ప్రాజెక్టు, చిన్నే రు, దబ్బలగుట్ట ప్రాజెక్టు, పెద్దమండ్యం మం డలంలోని మానుగుట్ట ప్రాజెక్టు, నిమ్మనపల్లె మండలంలోని బాహుదా ప్రాజెక్టులకు సాగునీటి సంఘాల ఎన్నికలు జరగనున్నా యి. అలాగే పెద్దతిప్పసముద్రం మండలంలో ని పీటీఎం పెద్దచెరువు, రంగసముద్రంచెరు వు, కందుకూరు వ్యాసరాయచెరువులు జిల్లాలోనే అతి పెద్దచెరువుల జాబితాలో ఉన్నాయి. అలాగే మదనపల్లె మండలం సీటీఎం పెద్దచెరువు, బి.కొత్తకోట మండలం బడికాయలపల్లె చెరువులు కూడా తర్వాతి స్థానంలో ఉన్నాయి.

నిబంధనలు ఇవీ..

ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులంతా భూమి శిస్తు చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకూ 1429 ఫసలీ వరకూ శిస్తులు చెల్లించగా, ప్రస్తుతం 1434 ఫసలీ నడుస్తోంది. అయితే తాజా ఎన్నికల నేపథ్యంలో కనీసం 1432 ఫసలీ వరకైనా నామినేషన్‌ వేసే అభ్యర్థి భూమిశిస్తు బకాయి లేకుండా చెల్లించాలి. ఈ మేరకు టీసీగా పోటీ చేసే ఔత్సాహికులు, రెవెన్యూ, వీఆర్వో దగ్గరకు పరుగులు తీస్తున్నారు. తాను ఇప్పటి వరకూ ఎంత శిస్తు చెల్లించాలో తెలుసుకుని ముందుకెళ్తున్నారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్‌, వీఆర్వో లాగిన్‌లో రైతుకు ఉన్న ఆయకట్టు శిస్తు బకాయిలు జాబితా సిద్ధం చేస్తున్నారు. పంచాయతీరాజ్‌ చట్టం ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికి వర్తించే నిబంధనలన్నీ ఇక్కడా వర్తిస్తాయి.

అయితే ముగ్గురు పిల్లలు ఉండకూడదనే నిబంధనపై ఇటీవల అసెంబ్లీలో చట్టసవరణ చేశారు. అయితే ఈ ఎన్నికల నోటిఫికేషన్‌ వెలువడే నాటికి గవర్నర్‌ జారీ చేసే గెజిట్‌ జారీ అయితే, ఆ నిబంధన వర్తిస్తుంది. లేకుంటే ముగ్గురు పిల్లలు గల రైతులు అనర్హులుగా చెబుతున్నారు. ప్రతి ఒక్క రైతూ ఓటరు గుర్తింపు కార్డు తీసుకోవాలి. ఫొటోతో కూడిన పట్టాదారు పాసుపుస్తకం, ఫొటోతో కూడిన వన్‌బీ లేదా ఆధార్‌ కార్డు ఉండాలి.

ఇవేమీ లేకుంటే, ఆయకట్టు రైతుగా వీఆర్వో నుంచి ధ్రువీకరణ పత్రం ఉండాలి. ఒక రైతుకు ఆరు టీసీల్లో భూమి ఉన్నా..రైతుకు ఓటుకుగాని, పోటీకి గాని ఒక చోటే అవకాశం ఉంటుంది. టీసీ మెంబర్ల వరకూ కోరం అవసరం లేదు. చైర్మన్‌, వైస్‌చైర్మన్‌ ఎన్నికకు మాత్రం ఆరుగురిలో ముగ్గురు హాజరయ్యేలా కోరం ఉండాలని ప్రభుత్వం జారీ చేసిన నిబంధన చెబుతోంది. చెరువులోని నీటిని వ్యవసాయానికి వాడుకున్న రైతు మాత్రమే భూమి శిస్తు చెల్లించాలి. చెరువు కింద భూమి ఉండి, బోరు నీటితో పంట సాగు చేసుకుంటే శిస్తు చెల్లించాల్సిన అవసరం లేదు. గతంలో శిస్తు చెల్లింపు మ్యాన్‌వల్‌గా జరగగా, ప్రస్తుతం రైతు పేరు, ఆయకట్టుపై శిస్తు ఆన్‌లైన్‌లో నమోదవుతోంది.

వరి కోతలు వాయిదా వేయండి

- 15లోగా బీమా ప్రీమియం చెల్లించాలి : డీఏవో

మదనపల్లె టౌన్‌, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా కురిసే వర్షాల సమయంలో రైతులు వరికోతలు వాయిదా వేయాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి (డీఏవో) చంద్రానాయక్‌ సూచించారు. బుధవారం మదనపల్లె మండలం చీకిలబైలు పంచాయతీ తిప్పారెడ్డిగారిపల్లె వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు వేస్తున్న పంటలకు డిసెంబరు 15వ తేదీ లోపు క్రాప్‌ ఇన్సూరెన్స్‌ తప్పకుండా చేయించుకోవాలన్నారు. రైతులు వారి వాటాగా నిర్ణయించిన ప్రీమియంను చెల్లించాలన్నారు. ఈ వివరాలను సీఎస్‌సీలో నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం మదనపల్లె పట్టణంలో ఎరువులు, పురుగుమందు విక్రయాల దుకాణాలను పరిశీలించి దుకాణ యజమానులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏడీఏ శివశంకర్‌, ఏవో నాగప్రసాద్‌, హెచ్‌వో ఈశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.


తిప్పారెడ్డిగారిపల్లె రైతులకు సూచనలిస్తున్న డీఏవో చంద్రానాయక్‌

తుఫాన్‌ హెచ్చరిక

సబ్‌కలెక్టరేట్‌లో కంట్రోల్‌ ఏర్పాటు

మదనపల్లె టౌన్‌, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాబోయే రెండు రోజుల్లో తుఫాన్‌ కారణంగా భారీగా వర్షాలు కురిసే అవకాశాల నేపథ్యంలో మదనపల్లె డివిజన్‌లో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను అప్రమత్తం చేస్తూ సబ్‌కలెక్టర్‌ మేఘస్వరూప్‌ ఉత్తర్వులు జారీ చేశారు. డివిజన్‌లోని 11 మండల కేంద్రాల్లో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, చెరువులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని రెవిన్యూ, జల వనరులశాఖాధికారులను హెచ్చరించారు. రైతులు ధాన్యాన్ని, పశు సంపదను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. 28, 29 తేదీల్లో అధిక వర్షాలు కురిసినప్పుడు అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని సబ్‌కలెక్టర్‌ కోరారు. డివిజన్‌లో తుఫాను కారణంగా కురిసే అధిక వర్షాలతో అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే సబ్‌కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూమ్‌ నెంబరు 08571-231181 నెంబర్‌కు ఫోన్‌ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఫిర్యాదులకు స్పందిస్తారని సబ్‌కలెక్టర్‌ వెల్లడించారు.

ఆర్భాటపు పెళ్లిళ్లు.. అప్పుల పాలు..

- భారమైపోతున్న పెళ్లి ఖర్చులు
- చితికిపోతున్న మధ్యతరగతి, సామాన్య కుటుంబాలు

6


కల్యాణమండపంలో అట్టహాసంగా ఏర్పాట్లు

బాల్య వివాహ రహిత

జిల్లాగా తీర్చిదిద్దాలి : కలెక్టర్‌


ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్‌ చామకూరి శ్రీధర్‌, అధికారులు

పీలేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించి జిల్లాను, రాష్ట్రాన్ని బాల్య వివాహ రహితంగా తీర్చిదిద్దాలని కలెక్టర్‌ చామకూరి శ్రీధర్‌ కేవీపల్లె మండలంలోని అధికారులను ఆదేశించారు. 'బాల్య వివాహ్‌ముక్త్‌ భారత్‌ దినోత్సవం సందర్భంగా 'బాల్య వివాహరహిత ఆంధ్రప్రదేశ్‌ కార్యక్రమాన్ని బుధవారం ఆయన కేవీపల్లెలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం కలిగించే సాంఘిక దురాచారం అయిన బాల్యవివాహాలను అడ్డుకోవాలని తెలిపారు. 'బాల్య వివాహరహిత ఆంధ్రప్రదేశ్‌ సాకారానికి కృషి చేస్తామని అధికారులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీజీఆర్‌ఎస్‌ దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా వాటిని క్షేత్రస్థాయిలో విచారించి నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని, మండలంలో ఉన్న విద్యార్థులందరికీ అపార్‌ ఐడీ రిజిస్ట్రేషన్‌ వీలైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. జనన ధృవీకరణ పత్రం లేని విద్యార్థుల వద్ద నోటరీ తీసుకోకూడదని, నోటరీ కావాలని అధికారులు అడిగినట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. హౌస్‌ హోల్డ్‌ జియో ట్యాగ్‌ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. కేవీపల్లె మండలానికి రూ.85 లక్షల పనులు మంజూరు చేశామని, ఆ పనుల నాణ్యతలో రాజీపడకూడదని పంచాయతీరాజ్‌ అధికారులను హెచ్చరించారు.

సమీక్ష సందర్భంగా పలు సమస్యలపై పలు ప్రజాసంఘాల నేతలు ఆయన వినతిపత్రాలు అందించారు. సమీక్ష అనంతరం ఆయన కేవీపల్లెలోని ఆదర్శ పాఠశాలను తనిఖీ చేశారు. ఆ తరువాత సొరకాయలపేట పంచాయతీ వంకార వడ్డిపల్లెలో నిర్మిస్తున్న సీసీ రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో డ్వామా, హౌసింగ్‌, డీఆర్‌డీఏ పీడీలు వెంకటరత్నం, శివయ్య, సత్యనారాయణ, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్‌, తహసీల్దారు క్రాంతికుమార్‌, ఎంపీడీవో సుధాకర్‌ బాబు, ఎంఈవో రెడ్డిబాషా, హౌసింగ్‌ ఏఈ హరిబాబు, ఏపీఎం మంజుల, ఏపీవో నాగరాజ, పాల్గొన్నారు.

బస్సు, లారీ ఢీ

- 15 మంది

అయ్యప్ప భక్తులకు గాయాలు

సంబేపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని ఎర్రగుంట్ల వద్ద బుధవారం తెల్లవారుజామున వద్ద పెను ప్రమాదం తప్పింది. శబరిమల వెళుతున్న అయ్యప్ప భక్తుల బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో 15 మంది అయ్యప్ప భక్తులు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు... విజయనగరం జిల్లాకు చెందిన అయ్యప్ప భక్తులు ప్రైవేట్‌ ట్రావెల్స్‌ బస్సులో శబరిమలకు వెళుతుండగా మండలంలోని ఎర్రగుంట్ల వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో 15 మంది అయ్యప్ప భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో బస్సు లారీ ముందు భాగాలు దెబ్బతిన్నాయి. గాయపడ్డ వారిని వెంటనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ సత్యారావు, మహేశ్‌, రామారావు, శ్రీధర్‌, ధనుంజయ, సత్యనారాయణలను మెరుగైన చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఏఎ్‌సఐ జానీబాషా, పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భక్తవత్సలం తెలిపారు.


ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు, లారీ

తహసీల్దార్‌ అవినీతిపై విచారణ

- సబ్‌ కలెక్టర్‌ వద్ద విచారణకు హాజరైన తహసీల్దార్‌, ఆరుగురు వీఆర్‌వోలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్‌

మదనపల్లె టౌన్‌, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలో ప్రజలు రెవిన్యూ సేవలు పొందాలంటే చేయి తడపాల్సిందే. ఈ విషయమై 'ఆ మేడమ్‌ అవినీతి కథలెన్నో' శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి సబ్‌కలెక్టర్‌ మేఘస్వరూప్‌ స్పందించారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్‌ క్యాంపు కార్యాలయంలో మదనపల్లె మండలంలో పనిచేస్తున్న ఆరుగురు వీఆర్‌వోలను విడివిడిగా సబ్‌కలెక్టర్‌ విచారించారు. ఏయే సర్వే నెంబర్లలో ఎవరికి పాసుపస్తకాలు మంజూరు చేశారు. అందులో అవినీతి జరిగిందా తదితర విషయాలను నిక్కచ్చిగా చెప్పాలని సబ్‌కలెక్టర్‌ ఆదేశించారు. ఈ సందర్భంగా పలు విషయాలను వీఆర్‌వోలు సబ్‌కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లారని సమాచారం. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 గంటలకు వరకు తహసీల్దార్‌ ఖాజాబీని సబ్‌కలెక్టర్‌ పలు అంశాలపై విచారించారు. ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన కథనంతో పాటు, తహసీల్దార్‌పై వచ్చిన ఫిర్యాదుల గురించి విచారించినట్లు తెలిసింది.

ఈ విషయమై సబ్‌కలెక్టర్‌ మేఘస్వరూప్‌ను వివరణ కోరగా ఈ ఐదు నెలల్లో రైతులు ఎవరైనా పాసుపుస్తకాల కోసం రెవిన్యూ అధికారులకు డబ్బులిచ్చినట్లు ఏదైనా సమాచారం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వీటితో పాటు రెవిన్యూ అంశాల్లో అవినీతి పాల్పడినట్లు, బాధితులు ఎవరైనా ఉంటే గురువారం ఉదయం 11 గంటలకు సబ్‌కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయాలని సబ్‌కలెక్టర్‌ కోరారు.

నేటి ఆధునిక యుగంలో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు పెళ్లిళ్ల ఖర్చులు పెనుభారంగా మారాయి. తల్లిదండ్రులకు పెళ్లిళ్ల ఖర్చులు తలకుమించిన భారమై అప్పులపాలవుతున్నారు. అదో ఫలాన రామయ్య, ఇదిగో ఎల్లయ్య, అదో చంద్రయ్య ఆర్భాటంగా పెళ్లిళ్లు చేసి అప్పులపాలై ఉన్న ఇళ్లు, భూమి అమ్ముకున్నారన్న వార్తలే వినిపిస్తున్నాయి. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు కోటీశ్వరులను చూసి వారితో పోటీపడి మధ్య తరగతికి చెందిన యువతీ, యువకులు పెళ్లిలో ఆర్భాటాలకు పోయి ఆర్థికంగా చితికిపోతున్నారు. గతంలో అతి తక్కువ ఖర్చుతో తమ ఇంటి ముంగిళ్లల్లోనే చలువ పందిళ్లు వేసుకుని కేవలం వేల రూపాయలతోనే పెళ్లి తంతు ముగించేవారు. ఇప్పుడు పెళ్లిళ్లకు లక్షలు దాటి కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నారు.


పెళ్లిళ్ల కోసం పెద్దఎత్తున సెట్టింగ్‌లు

పెళ్లి ఖర్చులను నియంత్రించాలి..



నేడు ఆర్భాటపు పెళ్లి ఖర్చులు మధ్యతగరతి కుటుంబీకులను, సామాన్యులను ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. దీనిపై ఆయా గ్రామాల్లోని మేధావులు, పెద్దలు, ప్రముఖులు కలిసి అందరూ చర్చించుకుని ఆర్భాటపు పెళ్లిళ్లకు చరమగీతం పాడాలి. తిరిగి పాతరోజులు రావాలి. వధూవరుల ఇంటి వద్దే, ఆయా గ్రామాల్లో ఉన్న ఆలయాలు, చావిళ్ల వద్ద అతి తక్కువ ఖర్చుతో సంప్రదాయ పెళ్లిళ్లు చేయాలి. అందులో ఉన్న మజా ఎందులోనూ ఉండదు. దీనిపై అందరూ ఆలోచించి తక్కువ ఖర్చుతో సంప్రదాయ పెళ్లిళ్లకు నడుం బిగిస్తే తప్ప ఖర్చులను నియంత్రించలేం. సమాజంలో మార్పు వస్తేనే ఇది సాధ్యం.

- సింగంశెట్టి కృష్ణకుమార్, న్యాయవాది, రాజంపేట


పెళ్లి మండపానికి భారీ ముస్తాబు

ఆర్భాటపు పెళ్లిళ్లు.. అప్పుల పాలు...



- భారమైపోతున్న పెళ్లి ఖర్చులు
- చితికిపోతున్న మధ్యతరగతి, సామాన్య కుటుంబాలు
- నియంత్రణలేని హంగులు, ఆర్భాటాలు, విందులు, వినోదాలు


పెళ్లివేదిక ముంగిట పెద్దఎత్తున విద్యుద్దీపాలంకరణ


అందంగా స్వాగత తోరణాలు

రాజంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నేటి హైటెక్ యుగంలో వివాహతంతు మధ్యతరగతి కుటుంబీకులను కుంగదీస్తోంది. ఈ వివాహ ఘట్టంలో జరిగే ఆడంబరాలకు సామాన్య మధ్యతరగతి కుటుంబీకులు లక్షల్లో ఖర్చులు చేసి పెళ్లిళ్లు చేయడం వల్ల అప్పులపాలై కుంగిపోతున్నారు. స్థోమతకు మించిన ఖర్చులు చేసి అష్టకష్టాలు పాలవుతున్నారు. ఒకప్పుడు మన పూర్వీకులు వివాహాలను ఇళ్ల ముంగిళ్లలోను, గ్రామచావిడిలలోను, ఆయా గ్రామాల ఆలయాల్లో నిరాడంబరంగా చేసుకునేవారు. చలువపందిళ్లు, మామిడితోరణాలు, అరటి పిలకలతో పాటు ఓపాటి మైకుసెట్, ఆయా గ్రామాలకు చెందిన మంగళవాయిద్యాలు అవసరమైతే ఓ మోస్తరు విద్యుద్దీపాలు ఏర్పాటు చేసుకుని అతి తక్కువ ఖర్చుతో చేసుకునేవారు. లడ్డు, కారాలు, పాయసం, పప్పన్నంతో ఈ తంతు ముగించేవారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అసలు పెళ్లంటేనే ప్రధానంగా పెళ్లికుమార్తె తల్లిదండ్రులకు ఆర్థిక గండంగా మారిపోయింది. ప్రధానంగా ఇప్పుడు పెళ్లంటే పెద్ద పెద్ద కల్యాణమండపాల్లో భారీ సెట్టింగ్‌లు, భారీ విద్యుద్దీపాలంకరణ, పెద్దఎత్తున స్వాగత తోరణాలు, వచ్చిన అతిథులకు హైటెక్ రీతిలో కొత్త కొత్త హంగులతో ఏర్పాట్లు, 10 రకాల స్వీట్లతో కూడిన విందు ఏర్పాట్లు, ముత్యాల పల్లకీలు, వేదికపై పూల సెట్టింగ్‌లు, ప్రధానంగా ఆర్కెస్ట్రా ఇలా చెప్పుకుంటూ పోతే చాంతాడంతా ఏర్పాట్లు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మామూలుగా అనాది నుంచి పెళ్లి కుమారుడికి పెళ్లికుమార్తె తరఫున కట్న కానుకలు ఇచ్చేవారు. ఆ కట్నకానుకలు ఇప్పుడూ కొనసాగుతున్నాయి. గతంలో అయితే పెళ్లి కుమారునికి ఏమిచ్చేవారు అని అడిగేవారు. ఇప్పుడు అలా కాకుండా ఇప్పుడు మీ అమ్మాయికి పెద్దఎత్తున నగలు చేయించుకోండి, అలాగే పెళ్లికుమారునికి చేయించండి, మీరిచ్చే స్థిరాస్తులను ఇద్దరి పేరిట రాయించండి, పెళ్లిని పెద్ద కల్యాణమండపంలో చేయించండి, పెళ్లిలో మెనూ ఇలా ఉండాలని పెళ్లికుమారుడి బంధువులు చెప్పేస్తున్నారు. ప్రేమ వివాహాలు మినహా మిగిలిన వివాహాలన్నీ ఇలాగే జరిగిపోతున్నాయి. ఇలా పెళ్లికుమార్తెకు, పెళ్లి కుమారుడికి బంగారు ఆభరణాలు, వారికిచ్చే స్థిరాస్తులు లక్షలు దాటిపోతున్నాయి. ఒక మధ్య తరగతి పెళ్లి కుమార్తె తల్లిదండ్రులకు వీటికే అరకోటి పైబడుతోంది. తిరిగి ఆడంబరపు పెళ్లి ఖర్చులు కనీసం 30 లక్షలు పైబడుతోంది. పెళ్లికి ముందు నిశ్చితార్థం పేరిట లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది.

ఒక్క పెళ్లి తంతు మొదలైతే నిశ్చయతాంబూలాకు లక్ష, నిశ్చితార్థానికి 5 లక్షలు, కల్యాణం రోజున కల్యాణమండపానికి 2 లక్షలు, స్టేజిపై పూలంకరణ 5 లక్షలు, ఆర్కెస్ట్రాకు కనీసం లక్ష, మంగళవాయిద్యాలకు లక్ష, భోజనాలకు 5 నుంచి 10 లక్షలు, డ్రోన్ కెమెరాలకు, వీడియోలకు 2 నుంచి 5 లక్షలు, సెట్టింగులకు, డెకరేషన్లకు, స్వాగత తోరణాలకు మరో 5 లక్షలు ఖర్చవుతోంది. మలిపెళ్లి పేరిట విందు వినోదాలకే మరో 2 లక్షలు దాటుతోంది. తిరిగి నూతన వధువును వరుడి ఇంటికి పంపడానికి లక్ష నుంచి 2 లక్షలు పైబడుతోంది. ఇలా చెప్పలేని ఖర్చులు మధ్యతరగతి కుటుంబానికి అరకోటి రూపాయలు దాటుతాయి. ఆభరణాలు, వరకట్నం ఇవన్నీ లెక్కలేస్తే రూ.కోట్లు దాటిపోతున్నాయి. ఈ విధంగా పెళ్లి ఖర్చులు మధ్యతరగతి వారికి ఎంతో ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఆర్థికంగా బలపడిన కుటుంబాల్లో ఈ వివాహ వేడుకలు కోట్లను దాటుతున్నాయి. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు మధ్య తరగతి కుటుంబీకులు, సామాన్యులు ఆర్థికంగా బలపడినవారిని చూసి వారు పెళ్లిళ్లు చేసేవిధంగా వీరూ చేస్తూ ఇబ్బందుల పాలవుతున్నారు. పెళ్లి కాకుండానే ప్రధానంగా నిశ్చితార్థం పేరిటే లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. ప్రీవెడ్డింగ్, ఫొటో షూటింగ్ సినిమా లెవల్లో పెళ్లికి ముందే వింత సంప్రదాయాలకు లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. ఈ ఆధునిక యుగంలో ఈ ఆర్భాటపు వింత సంస్కృతి ఎక్కువైపోతోంది. భవిష్యత్ తరాలు ఈ ఆర్భాటపు పెళ్లి ముసుగులో లక్షల్లో ఖర్చు చేసి అప్పుల ఊబిలో మునిగిపోతున్నారు.

పెళ్లి బట్టలకు లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. కొందరైతే 20 రకాల వంటకాలు, పది రకాల ఫ్రూట్‌లు, అల్పాహారం, పది రకాల స్వీట్లు, ఇలా ఒక్కో ప్లేటు భోజనానికి వెయ్యి రూపాయలు ఖర్చు చేసే పరిస్థితి వచ్చింది. ఈ ఆర్భాటాలన్నీ సామాన్యులకు పెనుభారమవుతోంది. అసలు పెళ్లి పనులు మొదలయ్యాయంటే ఏడాదికి ముందే విలాసవంతమైన కల్యాణ మండపాలను బుక్ చేసుకుంటున్నారు. ముందు కల్యాణమండపాలు దొరికిన తేదీకే పెళ్లిళ్లు పెట్టుకుంటున్నారు. ఏడాదికి ముందే పెళ్లిళ్లకు వచ్చే అతిథుల కోసం విలాసవంతమైన రూములను బుక్ చేసుకుంటున్నారు. ఈ విధంగా సామాన్య, మధ్యతరగతి కుటుంబీకులు ఈ ఆర్భాటాల పెళ్లిలకు పోయి ప్రధానంగా పెళ్లి కుమార్తె తల్లిదండ్రులు ఆర్థికంగా చితికిపోయి వారికున్న కొద్దిపాటి స్థిరాస్థులను అమ్ముకుని కొందరైతే ఇంటిని కూడా అమ్ముకుని పెళ్లిళ్లకు ఖర్చు చేస్తున్నారు. పెళ్లిళ్లపై నియంత్రణ లేకపోవడంతో ప్రధానంగా కుమార్తెను కన్న తల్లిదండ్రులకు పెను సవాల్‌గా మారింది. ఈ విషయంలో ఆయా గ్రామాల పెద్దలు, విశ్లేషకులు, ప్రధానంగా యువతీ యువకులు, ఆయా గ్రామాలకు చెందిన ప్రముఖులు వీటిపై ఆయా ప్రాంతాల్లోనే సమావేశాలు నిర్వహించి పెళ్లయ్యే యువతీ యువకుల్లోను, వారి తల్లిదండ్రుల్లోను అవగాహనా సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సంప్రదాయబద్ధంగా ఇళ్ల ముంగిటే అతితక్కువ మందితో పెళ్లిళ్లు నిర్వహించి ఖర్చులు నియంత్రించి వరకట్నాలను దూరం చేయడానికి విజ్ఞులు, విద్యావంతులు అవగాహన తెస్తే తప్ప ఈ పెళ్లి ఆర్భాటాలతో సామాన్య, మధ్య తరగతి కుటుంబీకులు బయటపడే పరిస్థితి కనిపించడం లేదు.

అప్పులు చేసి ఆర్భాటంగా పెళ్లి చేయడమెందుకు..



అప్పులు చేసి ఆర్భాటంగా పెళ్లి చేయాల్సిన పనేముంది. ఎవరో కోటీశ్వరుడు ఆర్భాటంగా పెళ్లి చేశారని సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారు పోటీ పడడమేంటి. పూర్వీకులు పెళ్లిని ఎంతో పుణ్యకార్యంగా భావించి అతి తక్కువ ఖర్చుతో నిర్వహించేవారు. బంధువులు, గ్రామస్థులతో ఇంటి వద్ద కొన్ని ఫలహారాలు చేసి ముగించేవారు. మంగళవాయిద్యాలు, మామిడితోరణాలు, చలువపందిళ్లు, అరటి పిలకతోనే ఇంటిముంగిట కల్యాణమండపాన్ని ఏర్పాటు చేసి సంప్రదాయ పద్ధతిలో పెళ్లిళ్లు చేసేవారు. ఇదేమి వింతపోకడో సంప్రదాయాలకు తిలోదకాలు ఇచ్చి ఆర్భాటంగా పెళ్లిళ్లు చేసి అప్పులపాలు కావడంలో అర్థం ఉందా.

- రవిగోపాల్‌శర్మ, పురోహితుడు, నగరిపాడు, చిట్వేలి

యువతీ యువకుల్లో మార్పు వస్తే సాధ్యం..



యువతీ యువకుల్లో మార్పు వస్తే పెళ్లిల్లో ఆర్భాటపు ఖర్చులు నియంత్రించవచ్చు. చదువుకున్న యువతీ యువకులు ఈ విషయంలో ఎంతో ఆదర్శంగా ముందుకు రావాలి. ఎక్కువ ఖర్చులు చేసి అప్పులపాలై ఆర్భాటపు పెళ్లిళ్లు చేసుకుంటే కుటుంబం అప్పులపాలు కావడం తప్ప ఉపయోగం లేదని గ్రహించాలి. ప్రధానంగా మధ్యతరగతి, సామాన్య కుటుంబాల యువతీ యువకుల్లో ఆర్భాటం లేని ఆదర్శ పెళ్లిళ్లకు ముందుకు రావాలి. తమ తల్లిదండ్రులు, తాము అప్పులు పాలుకాకుండా ఉండగలుగుతామన్న ఆలోచనతో ముందుకు వస్తేనే అన్నివిధాలా మంచిది.

- చల్లా సుధాకర్, సంఘ సేవకుడు, అగ్రహారం

తహసీల్దార్‌పై

చర్యలు తీసుకోండి

సబ్‌కలెక్టరేట్ ఎదుట బీకేఎంయూ నాయకుల ధర్నా


సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీకేఎంయూ నాయకులు

మదనపల్లె టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలో పేద రైతుల పొట్టకొడుతున్న తహసీల్దార్ ఖాజాబీపై చర్యలు తీసుకోవాలని బీకేఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కృష్ణప్ప ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్ప మాట్లాడుతూ మదనపల్లె మండలంలో సన్న, చిన్నకారు రైతులను తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ వీఆర్‌వోలను అడ్డం పెట్టుకుని వేధిస్తున్నారని ఆరోపించారు. ముడుపులు చెల్లించిన వారికి మాత్రమే పనులు జరుగుతున్నాయన్నారు. ఈ నాలుగు నెలల్లో మదనపల్లె మండలంలో ఎన్ని మ్యుటేషన్స్ జరిగాయి, ఎంత అవినీతి జరిగిందో సబ్‌కలెక్టర్ సమగ్ర విచారణ చేయాలని కోరారు. సాంబశివ మాట్లాడుతూ గతంలో గుర్రంకొండలో పనిచేసినప్పుడు కూడా తీవ్ర ఆరోపణలు వచ్చాయని, తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌కలెక్టరేట్ ఇన్‌చార్జి డీఏవో రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీకేఎంయూ నాయకులు చంద్రశేఖర్, మురళి, హరి, సుశీల, నరసింహులు పాల్గొన్నారు.

‘రిమ్స్’ ప్రొఫెసర్లపై విచారణకు నోటీసులు

- ఆసుపత్రి కార్యాలయ సూపరింటెండెంట్‌పై కూడా...
- ఆరేళ్ల తరువాత విచారణపై కదలికలు

కలికిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప ‘రిమ్స్’ వైద్యశాల, రిమ్స్ వైద్య కళాశాలకు చెందిన ముగ్గురు వైద్యులు, ఒక బోధనాపరమైన అధ్యాపకుడు, మరో ఆసుపత్రి సూపరింటెండెంట్‌లపై విచారణకు ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. 2016లో రిమ్స్‌లో వెలుగులోకి వచ్చిన అవకతవకలపై ఏసీబీ విచారణ జరిపింది. దీనిపైన 2016 ఏప్రిల్ 16 సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఏసీబీ అందజేసిన నివేదికను పరిశీలించిన ప్రభుత్వం మొత్తం ఐదుగురిపై అభియోగాలు నమోదు చేసి వారి నుంచి 2018 అక్టోబరు 26న సంజాయిషీలు తెలుపుకోవడానికి అవకాశమిస్తూ నోటీసులు జారీ చేసింది. అప్పట్లో రిమ్స్ వైద్యశాల సాధారణ వైద్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎం.సురేశ్వరరెడ్డి, ఆర్థోపెడిక్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జొన్నా నగేష్, ఆసుపత్రి కార్యాలయం సూపరింటెండెంట్ లాల్‌బంద్ షేక్ మహబూబ్ బాషా, మరో ఆర్థోపెడిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సంజీవయ్య, రిమ్స్ వైద్య కళాశాల కంటి విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీడీఎల్ సత్యనారాయణలపై నమోదైన అభియోగాలను వివరిస్తూ ఈ సంజాయిషీ నోటీసులు జారీ అయ్యాయి.

పది రోజుల్లోగా వివరణలు ఇవ్వాలని గడువు విధించింది. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో వైసీపీ పాలన జరిగిన ఐదేళ్లూ ఆ తరువాత జరగాల్సిన విచారణ మూలనపడింది. తాజాగా ఈ వ్యవహారాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించి విచారణకు ఆదేశించింది. మొత్తం ఐదుగురినీ కలిపి విచారించి నివేదిక సమర్పించడానికి తిరుపతి రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవిప్రభును విచారణాధికారిగా నియమించింది. రెండు నెలల్లోగా విచారణ నివేదికను ప్రభుత్వానికి అందజేయాల్సిందిగా కూడా ప్రభుత్వం ఆదేశించింది. దీనికి సంబంధించిన అన్ని రికార్డులను విచారణాధికారికి అందచేయాలని వైద్య విద్య డైరెక్టరును ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి.హోస్‌మణి బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో


పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఈవో సుబ్రమణ్యం

నందలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రమణ్యం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన రిజిస్టర్‌లు, రికార్డులను పరిశీలించారు. తరగతి గదుల్లో జరుగుతున్న బోధన అభ్యాసన ప్రక్రియలు, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను ఉపాధ్యాయులకు సంబంధించి అకడమిక్ మానిటరింగ్ అంశాలను పర్యవేక్షించారు. పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పలు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం విద్యార్థులచే బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జీసీడీవో ఎస్.శశికళ, డీఈవో కార్యాలయ క్యాంపు క్లర్కు ఎస్.హబీబ్, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎస్.రౌఫ్ బాషా, పాఠశాల ఉపాధ్యాయులు, నాన్‌టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు ప్రజల

రుణం తీర్చుకుంటా

రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి


చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న కేకే చౌదరి

రైల్వేకోడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు ప్రజల రుణం తీర్చుకుంటానని రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి తెలిపారు. విజయవాడలో బుధవారం ఆయన చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్‌గా తాను ప్రజలకు ఏమి చేయగలనో అవన్నీ చేసి చూపిస్తామని తెలిపారు. నాపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లకు ఎలాంటి చెడ్డ పేరు తీసుకుని రాకుండా పరిపూర్ణమైన సేవలు ప్రజలకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమానికి టీడీపీ ఇన్‌చార్జ్, అడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, రైల్వేకోడూరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

- క్రీడలతో మానసిక ఉల్లాసం...
- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయం సమీపంలో గల పోలీస్ పెరేడ్ మైదానంలో బుధవారం జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ ఫ్లాగ్‌ను ఎగురవేసి, స్టేట్ మీట్‌లో డెకాత్లాన్‌లోని 10 ఈవెంట్లలో వరుసగా మూడు సంవత్సరాలు గోల్డ్ మెడల్ సాధించిన హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య, రాష్ట్ర అథ్లెటిక్స్‌లో నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించిన ఉమెన్ పీసీ శశికళ ఎస్పీకి క్రీడా జ్యోతిని అందించగా ఎస్పీ క్రీడాజ్యోతిని వెలిగించి మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బందిలోని క్రీడా ప్రతిభను వెలికితీయడానికి పోలీసు స్పోర్ట్స్ మీట్ ఎంతో దోహదపుతుందన్నారు. ఆటలు ఓటమిని, కష్టాన్ని భరించే భక్తిని ఇస్తాయని, 24 గంటలు విధి నిర్వహణలో ఉండే పోలీసు సిబ్బందికి ఈ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు వారిలో ఉన్న క్రీడా ప్రతిభకు గుర్తింపు తీసుకువస్తుందన్నారు. జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర పోలీసు మీట్‌కు పంపిస్తామన్నారు. పిల్లల్ని కూడా గేమ్స్ ఎక్కువగా ఆడించాలన్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత మొట్టమొదటి సారిగా జిల్లాలో పోలీసు స్పోర్ట్స్ మీట్ జరుగుతోందని తెలిపారు. అలాగే 27, 28, 29 తేదీల్లో వరుసగా మూడు రోజుల పాటు సాగే ఈ స్పోర్ట్స్ మీట్‌లో 4 జోన్లకు సంబంధించిన నాలుగు టీమ్‌లు (రాయచోటి, మదనపల్లె, రాజంపేట, ఏఆర్ హెడ్ క్వార్టర్స్) కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్, 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగుపందెం, హైజంప్, లాంగ్‌జంప్, క్రికెట్, టెన్నిస్, షటిల్ మొదలగు క్రీడల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వెంకటాద్రి, రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, రాజంపేట డీఎస్పీ సుధాకర్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.





పోలీసు క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు - క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో పోలీసు క్రీడాకారులు

రహదారుల భద్రతకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రహదారుల భద్రత సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అజెండా అంశాలపై సమీక్షించారు. ఇందులో జూలై, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల ప్రమాద డేటా విశ్లేషణ, మూడు కంటే ఎక్కువ మరణాలపై ఉమ్మడి తనిఖీ అంశాలపై సమీక్షించారు.

ఇంటిగ్రేటెడ్ రోడ్డు యాక్సిడెంట్స్ అండ్ డెత్ డేటాపై సమీక్షించారు. వచ్చే ఏడాది 2024-25 కోసం జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల్లో బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి సరిదిద్దడానికి కార్యాచరణ ప్రణాళికను అమలుపరచడం, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం, హిట్ అండ్‌రన్ కేసుల బాధితులకు పరిహారం, గత రోడ్డు భద్రత సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు. ఇందులో 2023, 2024లో ఇప్పటి వరకు చోటు చేసుకున్న ప్రమాదాలపై సమీక్షించారు. 2023లో మొత్తం 593 ప్రమాదాలు జరగగా, ఇందులో 274 ప్రాణాంతకం కేసులు, 319 ప్రాణాంతకం కానివి, 314 మరణాలు, 786 మంది గాయపడినట్లు తెలిపారు. ఈ ఏడాది అక్టోబరు నెలాఖరు వరకు మొత్తం 533 ప్రమాదాలు జరగగా, ఇందులో 255 ప్రాణాంతకం కేసులు, 278 ప్రాణాంతకం కానివి, 289 మరణాలు, 656 మంది గాయపడినట్లు నివేదికలు సూచిస్తున్నాయని, ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

అత్యధిక శాతం రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. జనాభాతో పాటు వాహనాల వినియోగం కూడా పెరుగుతున్న నేపథ్యంలో రవాణా శాఖ, పోలీసు, అనుబంధ శాఖల అధికారులు, రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి వాహన ప్రమాదాలను అరికట్టే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్లు మేఘస్వరూప్, నిదియా దేవి, ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా రవాణా అధికారి ప్రసాద్, ఎంవీఐలు, పోలీసుశాఖ అధికారులు, డీఎస్పీలు, ఎన్‌హెచ్‌ఏఐ, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యం, విద్యుత్, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం హామీకి ఐదేళ్లు

- 2019 ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, జగన్ హామీలు
- ఎత్తిపోతల పథకంతో పంట పొలాలను సస్యశ్యామలం చేస్తామంటూ జగన్ గొప్పలు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో ఊసే లేని వైనం
- కూటమి ప్రభుత్వంపైనే రైతుల ఆశలు


గోపవరం మండలం బ్రాహ్మణపల్లె వద్ద సోమశిల వెనుక జలాలు (ఫైల్)

బద్వేలు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టుల నుంచి ప్రవాహం కాకుండా వృథాగా మిగిలిపోతున్న ప్రాజెక్టుల వెనుక జలాలను ఎత్తిపోతల పథకం (లిఫ్ట్ రిగేషన్) ద్వారా కాల్వలు, చెరువులకు నీటిని తరలిస్తే పంట పొలాలు సస్యశ్యామలం అవు తాయి. ఆ దిశగా సోమశిల ప్రాజెక్టు వెనుక జలాలను ఎత్తిపోతల పథకం ద్వారా బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాల చెరువులకు మళ్లిస్తే వాటి ఆయకట్టు కింద ఉన్న వేలాది ఎకరాల భూములు పచ్చని పంటలతో కళకళలాడే అవకాశం ఉంది. ఆ దిశగా నూత నంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవా లంటూ ఆయా మండలాల రైతులు కోరుతున్నారు.

గోపవరం మండలం బ్రాహ్మణపల్లె వద్ద ఉన్న సోమశిల వెనుక జలాల వద్ద ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తే దాదాపు గోప వరం, బద్వేలు, అట్లూరు మండలాల్లోని 36 చెరవులకు సాగు నీరందించే అవకాశం ఉంది. ఈ మూడు మండలాల్లోని చెరువులను నీటితో నింపినట్లయితే పంట పొలాలు సస్యశ్యామలంగా మారే అవకాశం ఉంది. దీంతో ఈ ప్రాంతంలోని రైతులు ఎత్తిపోతల పథకం నిర్మిస్తే తమ బతుకులు బాగు పడుతాయని ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఎన్నికల ప్రచారంలో హామీలు..

2019లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు స్థానిక ఎస్‌బీవీఆర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార బహిరంగ సభలో సోమశిల వెనుక జలాలను ఎత్తిపోతల పథకం ద్వారా మూడుమండలాల చెరువులకు సాగునీరు అందిస్తామని.. హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన జీవోలు కూడా జారీ చేశామని.. మళ్లీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు చేస్తామని తెలి పారు. అలాగే స్థానిక నెల్లూరు రోడ్డులోని ఇండియన్ పెట్రోలు బం కు వద్ద నిర్వహించిన జగన్ రోడ్‌షోలో తమ ప్రభుత్వం అధి కారం లోకి వస్తే సోమశిల వెనుకజలాలను ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులకు సాగునీరందించి పంట పొలాలను సస్యశ్యామలం చేస్తామని గొప్పగా హామీ ఇచ్చారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో ఊసే లేదు

2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. జిల్లా వాసి వైఎస్ జగన్ సీఎం కావడంతో ఎత్తిపోతల పథ కంపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్నా ఎత్తిపోతల పథకం ఊసే లేకుండా పోయింది. వైసీపీ ప్రభుత్వానికి బద్వేలు నియోజకవర్గం మరో పులివెందులగా నిలచినప్పటికీ ఈ ప్రాంత రైతాంగానికి జగన్ ఐదేళ్ల అధికారంలో ఉన్నా హామీ అమలుపరచలేకపోయారు.

ఎత్తిపోతల పథకంపై పోరాటాలు

బ్రాహ్మణపల్లె సమీపంలోని సోమశిల వెనక జలాల వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించాలంటూ 2018లో సోమశిల ఎత్తిపోతల సాధన సమితి ఏర్పాటు చేసి పలుమార్లు పోరాటాలు సాగించారు. ఇందులో భాగంగా సోమశిల వెనక జలాలవద్ద నుంచి బద్వేలులోని నాలుగు రోడ్ల కూడలి వరకు పాదయాత్రల నిర్వహించారు. వారి పోరాటాల ఫలితంగానే అప్పట్లో ఇరుపార్టీల అధినేతలు ఎత్తిపోతల పథకం అవశ్యకత గుర్తించి హామీలు ఇచ్చారు. దీంతో గత వైసీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకం నిర్మిస్తుందని ఐదేళ్లుగా ఎదురు చూసినా ఫలితం లేదు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

2019 ఎన్నికల ప్రచారంలో అప్పటి సీఎం చంద్రబాబు సోమశిల ఎత్తిపోతల పథకంపై హామీ ఇవ్వడం.. అనంతరం జరిగిన ఎన్నికల్లో అధికారం కోల్పోవడం జరిగింది. తిరిగి 2024 ఎన్నికల్లో చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఆనాటి హామీని గుర్తుంచుకుని చంద్రబాబు సోమశిల ఎత్తిపోతల పథకం నిర్మిస్తారని కూటమి ప్రభుత్వంపై రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఏహెచ్‌ఏలను పశుసంవర్ధకశాఖలో విలీనం చేయాలి


పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శారదమ్మకు వినతి పత్రం అందజేస్తున్న రాజశేఖర్ తదితరులు

కడప రూరల్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న (ఏహెచ్‌ఏ) వారిని పశుసంవర్ధకశాఖలో విలీనం చేయాలని ఎపీఎన్జీఎఫ్ జిల్లా చైర్మన్ నంద్యాల రాజశేఖర్, నేతలు గణపతిరెడ్డి, ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శారదమ్మను కలిసి వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడుతూ ఏహెచ్‌ఏల సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు. పశుసంవర్ధకశాఖకు సంబంధంలేని అదనపు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని సూచించగా శారదమ్మ సానుకూలంగా స్పందించారన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నేతలు ఆరిఫ్, ఇమ్మానుయేల్, శివయ్య, హిమజ, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో రేఖామునికి కాంస్యపతకం



కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైవీయూకు చెందిన రేఖాముని అనే పీజీ విద్యార్థిని అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో కాంస్య పతకం సాధించింది. నాగార్జున యూనివర్శిటీలో జరుగుతున్న దక్షిణ, పశ్చిమ భారత అంతర్ విశ్వ విద్యాలయాల వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రేఖాముని 45 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఈమె సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో పీజీ మొదటి సంవత్సరం చదువు తున్నా రు. రేఖామునిని వైస్‌చాన్సలర్ క్రిష్టారెడ్డి, రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, వ్యాయామ విద్య సంచాలకులు సుబ్బారెడ్డిలు అభినందించారు.

మధ్యాహ్నభోజనంలో నాణ్యత పాటించాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ మీనాక్షి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఈఓ మీనాక్షి తెలి పారు. బుధవారం కడప నగరం మున్సిపల్ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజనాన్ని మరింత మెరుగ్గా చేయాలని సూచించారు. టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పనిచేయాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, ఖాజాపీర్, ఆయూబ్ పాల్గొన్నారు.

జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలి



ఐటీఐ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పీఆర్ఎస్ వైఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం (పీఆర్ఎస్ వైఎఫ్) జిల్లా కన్వీనరు ఓ.నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం ఐటీఐ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాటాడుతూ రాయలసీమ కరువు ప్రాంతంగా మారి రైతుల ఆత్మహత్యలకు నిలయమైందన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, వేణు, అనిల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాల్యవివాహ రహిత దేశంగా చూడటమే లక్ష్యం


ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా అధికారులు

కడప కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహ రహిత దేశంగా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి అన్నపూర్ణదేవి పిలుపు నిచ్చారు. బుధవారం కలెక్టరేట్ లోని వీసీ హాలులో బాల్య వివాహ ముక్త్ భారత్ ప్రతిజ్ఞ, ప్రచార కార్యక్రమం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగింది. కలెక్టర్ శ్రీధర్ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఐసీడీఎస్ అధికారిణి శ్రీలక్ష్మీతో పాటు అధికారులు పాల్గొన్నారు. న్యూఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని.. వివాహ వయసుపై అవ గాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాలిక లకు మంచి విద్యను అందించే బాధ్యత తల్లిదండ్రులదన్నారు. మహిళలు అనేక రంగాలలో రాణిస్తున్నారని.. అందుకే సుప్రీం కోర్టు ఆదేశానుసారం కేంద్ర ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని రూపొ ందించి.. అన్ని శాఖల సమన్వయంతో బాల్య వివాహ రహిత దేశంగా తయారు చేయటానికి ప్రధాని ఆధ్వర్యంలో పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా అధికారులు ఆనంద్ నాయక్, మీనాక్షి తదితరులు పాలొన్నారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

105 గ్రాములు బంగారు, 116 గ్రాముల వెండి రికవరీ


వివరాలు వెల్లడిస్తున్న సీఐ జీవన్ గంగానాథ్‌బాబు

పులివెందుల టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీలో విశ్వనాథరెడ్డి అనే ఉపాధ్యాయుడి నివాసంలో జూలై 17న జరిగిన చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ జీవన్ గంగానాథ్‌బాబు తెలిపారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. పులివెందుల చెన్నారెడ్డికాలనీకి చెందిన విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యులు సొంత పని నిమిత్తం కడపకు వెళ్లగా ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న 105 గ్రాముల బంగారు, 116 గ్రాములు వెండి వస్తువులను దొంగలించారన్నారు. అప్పట్లో కేసు నమోదు చేసి జిల్లా ఎస్పీ, డీఎస్పీ మురళీ ఆదేశాల మేరకు రెండు టీంలుగా విడిపోయి దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ముద్దనూరు రింగు రోడ్డు సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న లింగుభేరి రాంబాబు, నడింపల్లి గోపి, సోనుకుమార్ రాయ్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. వారి వద్ద నుంచి 105 గ్రాముల బంగారు, 116 గ్రాములు వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, రావు రమేశ్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ప్రైవేటు హాస్పిటల్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం

- రూ.2లక్షల మేర ఆస్తినష్టం


సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి

కడప క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం శంకరాపురంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరే గడంతో ల్యాబ్‌లోని వస్తువులు కాలిపోయాయి. ఫైర్ స్టేషన్ సిబ్బంది వివరాల మేరకు... కడప శంకరాపురంలోని డాక్టర్ మామిళ్ల నాగప్రశాంత్ ఆస్పత్రిలో బుధవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి, కడప ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో దాదాపు రూ.2లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు ఆసుపత్రి యాజమాన్యం ఫిర్యాదు చేసింది.

మంచు కురిసే వేళ...


ఇటు తుఫాన్ ప్రభావం, నవంబరు నెల ఆఖరు కావడంతో బుధవారం ఉదయం 7 గంటల సమయంలో పంటపొలాలపై మంచు కురవడంతో దుప్పటిలా అలుముకుంది. ఈ దృశ్యం రబీలో సాగు చేసిన శనగ పంటపై ఆహ్లాదకరంగా మారింది. చూపరులను ఆకట్టుకుంది.
- రాజుపాళెం, ఆంధ్రజ్యోతి

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి

పెనగలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) :మండలంలో గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు కృషి చేయాలని ఎంపీడీవో విజయరావు కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమయ్యారు.డిసెంబరు లోగా గృహనిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం కోరుతోందన్నారు. ఇప్పటికీ నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ హరి ప్రసాద్ పాల్గొన్నారు.

మాతమ్మ ఆలయానికి రూ. 4 లక్షలు విరాళం

రైల్వేకోడూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కే. బుడుగుంట పల్లె పంచాయతీ తాడివారిపల్లెలో మాతమ్మ ఆలయ నిర్మాణానికి రైల్వే కోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి రూ. 4 లక్షలు చెక్కును బుధవారం విరాళంగా అంద జేశారు. ఎంపీటీసీ సభ్యుడు నూకా మహేశ్వర్ రెడ్డి, రైల్వేకోడూరు సర్పంచ్ బుడిగి శివయ్య, గంగురాజుపోడు సర్పంచ్ రామ కృష్ణయ్య, వెంకటరెడ్డిపల్లె సర్పంచ్ హరి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌యూ మహాసభలను జయప్రదం చేయండి

రాజంపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బద్వేల్ వేదికగా నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలంటూ ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం రాజంపేట ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభాకర్ నాయుడు, స్థానిక నాయకులు గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ మాట్లాడుతూ డిసెంబరు 5, 6 తేదీల్లో మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొండేటి హరిబాబు, నందకిషోర్, రెడ్డయ్య, తదిత రులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పండ్లు పంపిణీ

రాజంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బ నరసయ్యనాయుడు పుట్టినరోజు సందర్భంగా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, బాలింతలు, గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం సుబ్బనరసయ్య కార్యాలయంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సుధీర్, టీడీపీ నేతలు అబూ బకర్, మలిశెట్టి సుబ్బరాయుడు, ఉప సర్పంచ్ సతీష్, ఎంపీటీసీ సభ్యుడు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ పిటిషన్‌పై విచారణ

పుల్లంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మతం మారమని ఒత్తిడి చేస్తున్నారంటూ మండల పరిధిలోని కొత్తపేట పంచాయతీ వైఎస్ఆర్‌కాలనీకి చెందిన కొట్టం రాజేశ్వరి పంచాయతీ కార్యదర్శి పెంచలయ్యపై హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు చేసిన ఫిర్యాదుపై బుధవారం రాజంపేట డీఎల్పీవో మస్తాన్‌వలి విచారణ చేశారు. పెంచలయ్య ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను విచారణ చేశారు. గతంలో ఇదే ఫిర్యాదుపై విచారణ చేసి సమస్య పరిష్కరించామని, హ్యూమన్‌రైట్స్ కమిషన్ ఆదేశాల మేరకు తిరిగి విచారణ చేశామన్నారు. నివేదికను కమిషన్ కు పంపుతామన్నారు.

పేరుకే కలెక్టరేట్.. కనీస వసతులూ.. కరువే!

- బస్సెక్కాలంటే ఎండలో నిలబడాల్సిందే..
- ఏటీఎం, పోస్టాఫీసు లేక ఇబ్బందులు

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ఏర్పడి దాదాపు రెండేళ్ల ఆరు నెలలవుతున్నా కలెక్టరేట్ వద్ద కనీస వసతులు కల్పించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివిధ పనుల నిమిత్తం వస్తున్న ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హడావుడిగా జిల్లాను ప్రారంభించడంతో బాలుర వసతి గృహ భవనాన్ని కలెక్టర్ కార్యాలయంగా మార్చారు. ఇక్కడ దాదాపు 200 మందికి పైగా ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇప్పటివరకూ ఆ ప్రాంతంలో ఏటీఎం లేక పోవడంతో డబ్బు కట్టాలన్నా, తీసుకోవాలన్నా నాలుగు కిలోమీటర్ల దూరంలోని రాయచోటి పట్టణానికి వెళ్లాల్సి ఉంటుంది. తపాలా కార్యాలయం, కనీసం కొరియర్ పాయింట్ కూడా లేకపోవడంతో ఏవైనా పార్సిల్ చేయాల్సివస్తే తప్పని సరిగా పట్టణంలోకి వెళ్లాల్సి ఉంటుంది. అలాగైనా సరే వెళదామంటే ప్రజారవాణా సౌకర్యం అందుబాటులో ఉండదు. దాంతో తప్పనిసరిగా ఆటోలను



బస్ షెల్టర్ లేక రోడ్డుపైన బస్ కోసం వేచి ఉన్న ఉద్యోగులు



కలెక్టర్ కార్యాలయం దగ్గర ఎండలోనే వాహనాలు

ఆశ్రయించాల్సి వస్తోందని ఇక్కడ పని చేస్తున్న సిబ్బంది చెబుతున్నారు. ఇక కలెక్టరేట్ ప్రాంగణంలో వాహనాలు నిలిపేందుకు ఎలాంటి ఏర్పాటు లేకపోవడంతో ప్రతి శనివారం జేసీ కోర్టు, డీఆర్‌వో కోర్టుకు వచ్చే ప్రజలు, లాయర్లు తదితరుల వాహనాలు ఎండకు ఎండి, వానకు తడవాల్సిన పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఇక్కడ పని చేస్తున్న చాలా మంది ఇతర ప్రాంతాలకు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్లిపోయారు. ఇక మిగిలిన ఉద్యోగులు విధులు పూర్తయిన తర్వాత ఇళ్లకు వెళ్లేందుకు బస్సు కోసం రోడ్డుపైన గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. క్యాంటీన్ మూతపడడంతో భోజనం చేయడానికి కూడా టౌన్‌కు వెళ్లాల్సిన దుస్థితి.. దిగువ స్థాయి సిబ్బంది అంతంత మాత్రంగా ఉండ డంతోపాటు, ఒక్కో అటెండరు రెండు, మూడు సెక్షన్లకు సేవలందించాల్సి వస్తోంది. ఈ సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్న వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని సిబ్బంది కోరుకుంటున్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన

రాయచోటి టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో ఎదురయ్యే అనర్థాలపై అవగాహన పెంచుకుని, వాటిని అరికట్టాలని వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహకురాలు ప్రభావతి అన్నారు. బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం రాయచోటి ఆర్టీసీ బస్టాండులో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతులకు 18, యువకులకు 21 ఏళ్లకు ముందు వివాహం చేస్తే బాల్య వివాహం కింద పరిగణించవచ్చునన్నారు. ఇటువంటి వివాహాల కారణంగా ఆడపిల్లలు శారీకంగానూ, మానసికంగానూ, ఆరికంగానూ సమస్యలు ఎదుర్కొంటారన్నారు. ప్రస్తుతానికి బాల్యవివాహాలు తగ్గినా, మారుమూల ప్రాంతాల్లో అక్కడక్కడా ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది హసీనా, రెడ్డిప్రసన్న, శ్రావణి, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: మండల పరిధిలోని చిన్నఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాల్యవివాహ నిషేధ చట్టంపైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో ఓబులమ్మ మాట్లాడుతూ పేదరికం, అవగాహన లేకపోవడమే బాల్య వివాహాలకు కారణమన్నారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూయ, గుణవతి, ఎంఈవో రెడ్డయ్య, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ దస్తగిరి సాహెబ్, వెలుగు సిబ్బంది, ఏపీఎం మల్లికార్జునరాజు, సీసీ పి.దామోదర్, వీవోఏలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు: మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ భాగ్యలత



ఓబులవారిపల్లె: బాల్య వివాహాలను అరికట్టాలని ప్రతిజ్ఞ చేయిస్తున్న జడ్పీ సీఈవో

మాట్లాడారు.

పెనగలూరు: బాల్య వివాహాలను అరికట్టడంలో అంగన్వాడీలు ముఖ్యపాత్ర పోషించాలని పెనగలూరు ఎంపీడీవో విజయరావు కోరారు. బుధవారం చక్రంపేట అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్తలు, ఆయాలు, ఆశా కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు.

ఒంటిమిట్ట: బాల్య వివాహాలను అధికారులు సమిష్టితో కృషితో నిర్మూలించాలని ఈవోపీఆర్డీ కృష్ణ ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో స్త్రీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, మహిళా అధికారులతో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో మండల పంచాయతి సెక్రటరీలు, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

నందలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ రమేష్‌బాబు తెలిపారు. టంగుటూరు రైతుసేవా కేంద్రంలోని చింతకాయలపల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పైరుకు ఎకరాకు రూ 128 చొప్పున బీమా ప్రీమియంను డిసెంబరు 31వ తేదీ లోపు చెల్లించాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీవల్లి వరి నారుమడిలో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. యూటీఆర్-181 వరిరకంపై వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.మల్లికార్జున, రైతుసేవా కేంద్ర సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి.....

రైల్వేకోడూరు(రూరల్): రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ తెలిపారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా రైతులు ఎరువులు వాడితే పంటలకు మంచి దిగుబడులు పొందవచ్చనని తెలిపారు. బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని గంగారాజుపోడు, వీసీఆర్ కండ్రిగలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ



రైల్వే కోడూరు: సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణం చీడపీడలకు అనుకూలంగా ఉన్నందున రైతులు ముందు జాగ్రతగా సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాల నుంచి లబ్ధి పొందాలంటే ఈ పంట నమోదును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఎం.భాస్కర్, వీహెచ్ఏ హరిత, మార్కెటింగ్ సిబ్బంది, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదులో రాజంపేటకు అగ్రస్థానం

- సుగవాసికి సీఎం చంద్రబాబు అభినందన

రాజంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశంపార్టీ సభ్యత్వ నమోదులో రాజంపేట నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానం సాధించడంపై తెలుగుదేశం పార్టీ అధిష్టానం ప్రశంసలు కురిపించింది. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యంను టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభినందించారు. ఇప్పటివరకు 96, 600 సభ్యత్వాలు పూర్తి చేయడంపై అభినందనలు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం రాష్ట్రంలోని 30 వేల మంది పార్టీ కార్య కర్తలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, తదితరులతో నిర్వహించి న టెలీకాన్ఫరెన్స్‌లో సభ్యత్వాల నమోదుపై సమీక్షించారు. సుగవాసి బాలసుబ్రమణ్యం నేతృత్వంలో కేవలం ఒక నెలలోనే లక్ష సభ్యత్వాలు పూర్తి చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో రాజంపేటతో పాటు కుప్పం, కల్యాణదుర్గం, పాలకొల్లు, ఆత్మకూరు, మంగళగిరి, కనిగిరి, కోడూరు, వినుగొండ, కావలి, కోడూరు నియోజకవర్గాలు టాప్‌టెన్‌లో ఉన్నాయని, అక్కడి నాయకత్వాన్ని మన స్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు చంద్రబాబునాయుడు తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 52 లక్షల సభ్యత్వాలను పూర్తి చేయించడంపై రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను అభినందించారు.

సిద్ధవటం: సభ్యత్వ నమోదులో నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలిపినందుకు సుగవాసి బాలసుబ్రమణ్యంకు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య శుభాకాంక్షలు తెలిపారు.

మహాభారతంపై ధార్మికోపన్యాసం

రాజంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మహాభారతం పంచమ వేదంగా ప్రసిద్ధి చెందిందని హిందూ ధర్మప్రచార పరిషత్ ధర్మాచార్యుడు వెంకటరమణ తెలిపారు. ఊటుకూరు రామాలయంలో బుధవారం మహాభారత విశిష్టతపై ఆయన ధార్మికోపన్యాసం చేశారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అయ్యప్పరాజు, చంద్రశేఖర్, హరిరాజు, సుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి

రైల్వేకోడూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు వేగవంతం చేయాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం రైల్వేకోడూరు మండల పరిషత్ సభాభవనంలో వైస్ ఎంపీపీ



మండల మీట్‌లో పాల్గొన్న సభ్యులు, అధికారులు

రామిరెడ్డి ధ్వజారెడ్డి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామీణ రోడ్ల పక్కనే ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలని గత సమావేశంలో చెప్పినా, ఇంతవరకు చర్యలు లేవన్నారు. ఇప్పటికైనా పనులు చేయకుంటే తామే శ్రమదానం చేస్తామని తెలిపారు. గంగు రాజోడు సర్పంచ్ రామకృష్ణయ్య మాట్లాడుతూ ఉపాధి పనులు సక్రమంగా జరగడం లేదని ఆరోపించారు. ఎంపీటీసీ సభ్యుడు నూకా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని కోరగా, రెవెన్యూ అధికారులు స్థలాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని వైస్ ఎంపీపీ ఆదేశించారు. తాగునీరు, రోడ్లు, విద్యుత్ తదితర అంశాలను చర్చిం చారు.జడ్పీటీసీ సభ్యురాలు పాశెంకోట రత్నమ్మ, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అన్వర్ బాషా,ఎంపీడీవో సీహెచ్ నాగార్జున, పీఆర్ డీఈ బాలనరసింహులు, హౌసింగ్ డీఈ మురళీ కృష్ణ పలు శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫయర్ వితరణ

రామాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కుమ్మరపల్లి పంచాయతీ సూరకవాండ్లపల్లె ప్రాథమిక పాఠశాలకు సంపత్‌కుమార్, మహేశ్వర్‌రెడ్డి బుధవారం వాటర్ ప్యూరిఫయర్‌ను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు రాంమోహన్‌రెడ్డి గ్రీన్ కో సోలార్ సిబ్బంది పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి నూతన ప్రణాళికలు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నూతన ప్రణాళికలతో మండలాభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లె రాం ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఇటీవల మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు జలీల్‌బాషా కుటుంబాన్ని పరామర్శించేందుకు బుధవారం ఆయన మద్దిరేవుల రెడ్డివారిపల్లెను సందర్శించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 1.46 కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు, రూ. కోటి వ్యయంతో బోర్లు వేయడంతోపాటు, కొన్ని గ్రామాలకు ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. మండలంలో ప్రణాళికాబద్ధంగా పనులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీపీ మాజీ సభ్యుడు యనమల మదన్‌మోహన్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి ముమ్మడి బాబుల్‌రెడ్డి, యర్రంరెడ్డి, భాస్కర్‌రాజు, మంద సోమశేఖర్, ఆంజనేయులు, తుమ్మల శ్రీధర్, రవికుమార్‌రెడ్డి, బాలకృష్ణ, రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నమయ్య జయంతిని ఘనంగా నిర్వహిస్తాం

- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు హామీ

రాజంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జన్మస్థలమైన తాళ్లపాకను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, గ్రామంలోని ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీజేపీ కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు తదితరులు టీటీడీ చైర్మన్



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును సత్కరించిన బీజేపీ నాయకులు

బీఆర్ నాయుడును కోరారు. బుధవారం వారు టీటీడీ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యలను తెలుసుకోవడానికి, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహనతోపాటు స్థానిక ప్రజలతో చర్చించడానికి తాళ్లపాకలో పర్యటించాలని కోరారు. ఇందుకు స్పందించిన బీఆర్ నాయుడు తాళ్లపాక అన్నమయ్య జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొల్లపాటి మహేంద్ర, దగ్గుపాటి నరసింహులు తదితరులు ఉన్నారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

రాజంపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణం లో రోడ్ల పక్కన ఉన్న నిరు పేదలకు బుధవారం రాత్రి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యం లో దుప్పట్లను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపకుడు వెంకటరమణ మాట్లాడుతూ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు, పాత బస్టాండు, మార్కెట్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో చలికి వణుకు తున్నవారిని గుర్తించి 14 ఏళ్లుగా దుప్పట్లను పంచిపెడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నయ్య, నిత్యపూజ మణి, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, కట్టా కృష్ణయ్య, భాస్కర్, నరేంద్ర, చంద్ర, రంగప్రసాద్, లోకేష్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఏపీజీబీ ప్రోత్సాహకాలు

నందలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ప్రతిభా వంతులైన ముగ్గురు పేద బాలికలకు ఒక్కొక్కరికి 5 వేల రూపాయల చొప్పున బుధవారం ఏపీజీబీ ప్రగతి



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నందలూరు ప్రగతి గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ జాహ్నవీధర్ మాట్లాడుతూ తమ బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశానుసారం పేద విద్యార్థినులైన వైష్ణవి, శివప్రసన్న, హర్షనందినిలకు ఆర్థికంగా సహకారం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్‌రాజు, ఉపాధ్యాయురాలు లక్ష్మీకాంతం, శ్రీరామ్‌కుమార్, పీఈటీ జగన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ సమావేశంలో కోడూరు నేతలు

రైల్వేకోడూరు(రూరల్), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విజయవాడ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం రాష్ట్ర కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశానికి కోడూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ గోసాల దేవి, సీనియర్ నాయకులు ఎన్. శాంతయ్య హాజరయ్యారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశించినట్లు వారు తెలిపారు.

టీచింగ్ లెర్నింగ్‌పై వర్క్‌షాపు

రాజంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో బుధవారం సక్సెస్‌ఫుల్ టీచింగ్ లెర్నింగ్.. రీసెర్చ్ ప్రాక్టీస్ అనే అంశంపై ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాదుకు చెందిన విజ్ఞానభారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీఎస్ఎస్ఎస్ వి.ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులను పాఠాలు బోధించేవారుగా కాకుండా ప్రేరణ కలిగించే వ్యక్తులుగా మార్చుకోవాలన్నారు. అనంతరం అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ గంగిరెడ్డి, చొప్పా అభిషేక్‌రెడ్డి మాట్లాడారు. రిజిస్ట్రార్ ఎస్.మల్లికార్జున రావు, అన్ని విభాగాల అధిపతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనాల పరిశీలన

ఒంటిమిట్ట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను బుధవారం డీఎల్పీవో రాజ్యలక్ష్మి పరిశీలించారు. మండలంలోని నరసన్నగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో భవనా



పాఠశాలను పరిశీలిస్తున్న డీఎల్పీవో

లు శిథిలావస్థకు చేరుకున్నాయని గ్రామస్థులు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేయడంతో ఆమె క్షేత్రస్థాయిలో భవనాలను పరిశీలించారు. నూతన భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కృష్ణ ప్రసాద్, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ పంచాయతీల లక్ష్యాలను నెరవేర్చాలి

సిద్ధవటం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణ పంచాయతీల లక్ష్యాలను నెరవేర్చాలని డీపీవో రాజ్యలక్ష్మి ఆదేశించారు. బుధవారం మండలంలోని మాధ వరం-1 గ్రామ సచివాలయాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్ణ పంచాయతీ సర్వేలు పక్కాగా చేయాలన్నారు. కార్యదర్శులు ఇంటి పన్ను, నాన్ టాక్స్‌లను పరిశీలించి 30వ తేదీ లోపు అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారి మెహతాజ్ యాస్మిన్, కార్యదర్శి లక్ష్మీనరసయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయినుల సమస్యలు పరిష్కరించాలి

రాయచోటిటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయినుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నోబుల్ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర బాధ్యుడు కొండూరు శ్రీనివాసరాజు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం విజయవాడలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల అడిషనల్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన దేవనాథ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు , ఎంటీఎస్ అమలుపై సత్వర నిర్ణయం తీసుకోవాలని, కేజీబీవీల్లో నైట్ షిఫ్ట్ డ్యూటీలకు వార్డెన్‌లను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఏ నాయకులు ఏబీ రామకృష్ణంరాజు, కులశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అసిస్టెంట్ డైరెక్టర్ దేవనాథరెడ్డిని కలిసిన ఎన్‌టీఏ నేతలు

చంద్రబాబును విమర్శించే హక్కు వైసీపీకి లేదు

రైల్వేకోడూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లను విమర్శించే హక్కు మాజీ మంత్రి అప్పలరాజుకు లేదని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పుల్లెల రమేష్‌బాబు అన్నారు. బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్‌ను అప్పలరాజు కించపరుస్తూ మాట్లాడాడన్నారు. ఆయనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని కోరారు.

నేటి ఆధునిక యుగంలో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు పెళ్లిళ్ల ఖర్చులు పెనుభారంగా మారాయి. తల్లిదండ్రులకు పెళ్లిళ్ల ఖర్చులు తలకుమించిన భారమై అప్పులపాలవుతున్నారు. అదో ఫలాన రామయ్య, ఇదిగో ఎల్లయ్య, అదో చంద్రయ్య ఆర్భాటంగా పెళ్లిళ్లు చేసి అప్పులపాలై ఉన్న ఇళ్లు, భూమి అమ్ముకున్నారన్న వార్తలే వినిపిస్తున్నాయి. పులిని చూసి నక్కవాత పెట్టుకున్నట్లు కోటీశ్వరులను చూసి వారితో పోటీపడి మధ్య తరగతికి చెందిన యువతీ, యువకులు పెళ్లిలో ఆర్భాటాలకు పోయి ఆర్థికంగా చితికిపోతున్నారు. గతంలో అతి తక్కువ ఖర్చుతో తమ ఇంటి ముంగిళ్లల్లోనే చలువ పందిళ్లు వేసుకుని కేవలం వేల రూపాయలతోనే పెళ్లి తంతు ముగించేవారు. ఇప్పుడు పెళ్లిళ్లకు లక్షలు దాటి కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నారు.


పెళ్లిళ్ల కోసం పెద్దఎత్తున సెట్టింగ్‌లు

పెళ్లి ఖర్చులను నియంత్రించాలి..



నేడు ఆర్భాటపు పెళ్లి ఖర్చులు మధ్యతగరతి కుటుంబీకులను, సామాన్యులను ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. దీనిపై ఆయా గ్రామాల్లోని మేధావులు, పెద్దలు, ప్రముఖులు కలిసి అందరూ చర్చించుకుని ఆర్భాటపు పెళ్లిళ్లకు చరమగీతం పాడాలి. తిరిగి పాతరోజులు రావాలి. వధూవరుల ఇంటి వద్దే, ఆయా గ్రామాల్లో ఉన్న ఆలయాలు, చావిళ్ల వద్ద అతి తక్కువ ఖర్చుతో సంప్రదాయ పెళ్లిళ్లు చేయాలి. అందులో ఉన్న మజా ఎందులోనూ ఉండదు. దీనిపై అందరూ ఆలోచించి తక్కువ ఖర్చుతో సంప్రదాయ పెళ్లిళ్లకు నడుం బిగిస్తే తప్ప ఖర్చులను నియంత్రించలేం. సమాజంలో మార్పు వస్తేనే ఇది సాధ్యం.

- సింగంశెట్టి కృష్ణకుమార్, న్యాయవాది, రాజంపేట

ఆర్భాటపు పెళ్లిళ్లు.. అప్పుల పాలు...



- భారమైపోతున్న పెళ్లి ఖర్చులు
- చితికిపోతున్న మధ్యతరగతి, సామాన్య కుటుంబాలు
- నియంత్రణలేని హంగులు, ఆర్భాటాలు, విందులు, వినోదాలు


పెళ్లి మండపానికి భారీ ముస్తాబు

రాజంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నేటి హైటెక్ యుగంలో వివాహతంతు మధ్యతరగతి కుటుంబీకులను కుంగదీస్తోంది. ఈ వివాహ ఘట్టంలో జరిగే ఆడంబరాలకు సామాన్య మధ్యతరగతి కుటుంబీకులు లక్షల్లో ఖర్చులు చేసి పెళ్లిళ్లు చేయడం వల్ల అప్పులపాలై కుంగిపోతున్నారు. స్థోమతకు మించిన ఖర్చులు చేసి అష్టకష్టాలు పాలవుతున్నారు. ఒకప్పుడు మన పూర్వీకులు వివాహాలను ఇళ్ల ముంగిళ్లలోను, గ్రామచావిడిలలోను, ఆయా గ్రామాల ఆలయాల్లో నిరాడంబరంగా చేసుకునేవారు. చలువపందిళ్లు, మామిడితోరణాలు, అరటి పిలకలతో పాటు ఓపాటి మైకుసెట్, ఆయా గ్రామాలకు చెందిన మంగళవాయిద్యాలు అవసరమైతే ఓ మోస్తరు విద్యుద్దీపాలు ఏర్పాటు చేసుకుని అతి తక్కువ ఖర్చుతో చేసుకునేవారు. లడ్డు, కారాలు, పాయసం, పప్పన్నంతో ఈ తంతు ముగించేవారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అసలు పెళ్లంటేనే ప్రధానంగా పెళ్లికుమార్తె తల్లిదండ్రులకు ఆర్థిక గండంగా మారిపోయింది. ప్రధానంగా ఇప్పుడు పెళ్లంటే పెద్ద పెద్ద కల్యాణమండపాల్లో భారీ సెట్టింగ్‌లు, భారీ విద్యుద్దీపాలంకరణ, పెద్దఎత్తున స్వాగత తోరణాలు, వచ్చిన అతిథులకు హైటెక్ రీతిలో కొత్త కొత్త హంగులతో ఏర్పాట్లు, 10 రకాల స్వీట్లతో కూడిన విందు ఏర్పాట్లు, ముత్యాల పల్లకీలు, వేదికపై పూల సెట్టింగ్‌లు, ప్రధానంగా ఆర్కెస్ట్రా ఇలా చెప్పుకుంటూ పోతే చాంతాడంతా ఏర్పాట్లు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మామూలుగా అనాది నుంచి పెళ్లి కుమారుడికి పెళ్లికుమార్తె తరపున కట్న కానుకలు ఇచ్చేవారు. ఆ కట్నకానుకలు ఇప్పుడూ కొనసాగుతున్నాయి. గతంలో అయితే పెళ్లి కుమారునికి ఏమిచ్చేవారు అని అడిగేవారు. ఇప్పుడు అలా కాకుండా ఇప్పుడు మీ అమ్మాయికి పెద్దఎత్తున నగలు చేయించుకోండి, అలాగే పెళ్లికుమారునికి చేయించండి, మీరిచ్చే స్థిరాస్తులను ఇద్దరి పేరిట రాయించండి, పెళ్లిని పెద్ద కల్యాణమండపంలో చేయించండి, పెళ్లిలో మెనూ ఇలా ఉండాలని పెళ్లికుమారుడి బంధువులు చెప్పేస్తున్నారు. ప్రేమ వివాహాలు మినహా మిగిలిన వివాహాలన్నీ ఇలాగే జరిగిపోతున్నాయి. ఇలా పెళ్లికుమార్తెకు, పెళ్లి కుమారుడికి బంగారు ఆభరణాలు, వారికిచ్చే స్థిరాస్తులు లక్షలు దాటిపోతున్నాయి. ఒక మధ్య తరగతి పెళ్లి కుమార్తె తల్లిదండ్రులకు వీటికే అరకోటి పైబడుతోంది. తిరిగి ఆడంబరపు పెళ్లి ఖర్చులు కనీసం 30 లక్షలు పైబడుతోంది. పెళ్లికి ముందు నిశ్చితార్థం పేరిట లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది.

ఒక్క పెళ్లి తంతు మొదలైతే నిశ్చయతాంబూలాకు లక్ష, నిశ్చితార్థానికి 5 లక్షలు, కల్యాణం రోజున కల్యాణమండపానికి 2 లక్షలు, స్టేజిపై పూలంకరణ 5 లక్షలు, ఆర్కెస్ట్రాకు కనీసం లక్ష, మంగళవాయిద్యాలకు లక్ష, భోజనాలకు 5 నుంచి 10 లక్షలు, డ్రోన్ కెమెరాలకు, వీడియోలకు 2 నుంచి 5 లక్షలు, సెట్టింగులకు, డెకరేషన్లకు, స్వాగత తోరణాలకు మరో 5 లక్షలు ఖర్చవుతోంది. మలిపెళ్లి పేరిట విందు వినోదాలకే మరో 2 లక్షలు దాటుతోంది. తిరిగి నూతన వధువును వరుడి ఇంటికి పంపడానికి లక్ష నుంచి 2 లక్షలు పైబడుతోంది. ఇలా చెప్పలేని ఖర్చులు మధ్యతరగతి కుటుంబానికి అరకోటి రూపాయలు దాటుతాయి. ఆభరణాలు, వరకట్నం ఇవన్నీ లెక్కలేస్తే రూ.కోట్లు దాటిపోతున్నాయి. ఈ విధంగా పెళ్లి ఖర్చులు మధ్యతరగతి వారికి ఎంతో ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఆర్థికంగా బలపడిన కుటుంబాల్లో ఈ వివాహ వేడుకలు కోట్లను దాటుతున్నాయి. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు మధ్య తరగతి కుటుంబీకులు, సామాన్యులు ఆర్థికంగా బలపడినవారిని చూసి వారు పెళ్లిళ్లు చేసేవిధంగా వీరూ చేస్తూ ఇబ్బందుల పాలవుతున్నారు. పెళ్లి కాకుండానే ప్రధానంగా నిశ్చితార్థం పేరిటే లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. ప్రీవెడ్డింగ్, ఫొటో షూటింగ్ సినిమా లెవల్లో పెళ్లికి ముందే వింత సంప్రదాయాలకు లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. ఈ ఆధునిక యుగంలో ఈ ఆర్భాటపు వింత సంస్కృతి ఎక్కువైపోతోంది. భవిష్యత్ తరాలు ఈ ఆర్భాటపు పెళ్లి ముసుగులో లక్షల్లో ఖర్చు చేసి అప్పుల ఊబిలో మునిగిపోతున్నారు.

పెళ్లి బట్టలకు లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. కొందరైతే 20 రకాల వంటకాలు, పది రకాల ఫ్రూట్‌లు, అల్పాహారం, పది రకాల స్వీట్లు, ఇలా ఒక్కో ప్లేటు భోజనానికి వెయ్యి రూపాయలు ఖర్చు చేసే పరిస్థితి వచ్చింది. ఈ ఆర్భాటాలన్నీ సామాన్యులకు పెను భారమవుతోంది. అసలు పెళ్లి పనులు మొదలయ్యాయంటే ఏడాదికి ముందే విలాసవంతమైన కల్యాణ మండపాలను బుక్ చేసుకుంటున్నారు. ముందు కల్యాణమండపాలు దొరికిన తేదీకే పెళ్లిళ్లు పెట్టుకుంటున్నారు. ఏడాదికి ముందే పెళ్లిళ్లకు వచ్చే అతిథుల కోసం విలాసవంతమైన రూములను బుక్ చేసుకుంటున్నారు. ఈ విధంగా సామాన్య, మధ్యతరగతి కుటుంబీకులు ఈ ఆర్భాటాల పెళ్లిలకు పోయి ప్రధానంగా పెళ్లి కుమార్తె తల్లిదండ్రులు ఆర్థికంగా చితికిపోయి వారికున్న కొద్దిపాటి స్థిరాస్తులను అమ్ముకుని కొందరైతే ఇంటిని కూడా అమ్ముకుని పెళ్లిళ్లకు ఖర్చు చేస్తున్నారు. పెళ్లిళ్లపై నియంత్రణ లేకపోవడంతో ప్రధానంగా కుమార్తెను కన్న తల్లిదండ్రులకు పెను సవాల్‌గా మారింది. ఈ విషయంలో ఆయా గ్రామాల పెద్దలు, విశ్లేషకులు, ప్రధానంగా యువతీ యువకులు, ఆయా గ్రామాలకు చెందిన ప్రముఖులు వీటిపై ఆయా ప్రాంతాల్లోనే సమావేశాలు నిర్వహించి పెళ్లయ్యే యువతీ యువకుల్లోను, వారి తల్లిదండ్రుల్లోను అవగాహనా సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సంప్రదాయబద్ధంగా ఇళ్ల ముంగిటే అతితక్కువ మందితో పెళ్లిళ్లు నిర్వహించి ఖర్చులు నియంత్రించి వరకట్నాలను దూరం చేయడానికి విజ్ఞులు, విద్యావంతులు అవగాహన తెస్తే తప్ప ఈ పెళ్లి ఆర్భాటాలతో సామాన్య, మధ్య తరగతి కుటుంబీకులు బయటపడే పరిస్థితి కనిపించడం లేదు.


పెళ్లివేదిక ముంగిట పెద్దఎత్తున విద్యుద్దీపాలంకరణ


అందంగా స్వాగత తోరణాలు

అప్పులు చేసి ఆర్భాటంగా పెళ్లి చేయడమెందుకు..



అప్పులు చేసి ఆర్భాటంగా పెళ్లి చేయాల్సిన పనేముంది. ఎవరో కోటీశ్వరుడు ఆర్భాటంగా పెళ్లి చేశారని సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారు పోటీ పడడమేంటి. పూర్వీకులు పెళ్లిని ఎంతో పుణ్యకార్యంగా భావించి అతి తక్కువ ఖర్చుతో నిర్వహించేవారు. బంధువులు, గ్రామస్థులతో ఇంటి వద్ద కొన్ని ఫలహారాలు చేసి ముగించేవారు. మంగళవాయిద్యాలు, మామిడితోరణాలు, చలువపందిళ్లు, అరటి పిలకతోనే ఇంటిముంగిట కల్యాణమండపాన్ని ఏర్పాటు చేసి సంప్రదాయ పద్ధతిలో పెళ్లిళ్లు చేసేవారు. ఇదేమి వింతపోకడో సంప్రదాయాలకు తిలోదకాలు ఇచ్చి ఆర్భాటంగా పెళ్లిళ్లు చేసి అప్పులపాలు కావడంలో అర్థం ఉందా.

- రవిగోపాల్‌శర్మ, పురోహితుడు, నగరిపాడు, చిట్వేలి

యువతీ యువకుల్లో మార్పు వస్తే సాధ్యం..



యువతీ యువకుల్లో మార్పు వస్తే పెళ్లిల్లో ఆర్భాటపు ఖర్చులు నియంత్రించవచ్చు. చదువుకున్న యువతీ యువకులు ఈ విషయంలో ఎంతో ఆదర్శంగా ముందుకు రావాలి. ఎక్కువ ఖర్చులు చేసి అప్పులపాలై ఆర్భాటపు పెళ్లిళ్లు చేసుకుంటే కుటుంబం అప్పులపాలు కావడం తప్ప ఉపయోగం లేదని గ్రహించాలి. ప్రధానంగా మధ్యతరగతి, సామాన్య కుటుంబాల యువతీ యువకుల్లో ఆర్భాటం లేని ఆదర్శ పెళ్లిళ్లకు ముందుకు రావాలి. తమ తల్లిదండ్రులు, తాము అప్పులు పాలుకాకుండా ఉండగలుగుతామన్న ఆలోచనతో ముందుకు వస్తేనే అన్నివిధాలా మంచిది.

- చల్లా సుధాకర్, సంఘ సేవకుడు, అగ్రహారం

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోండి

సబ్‌కలెక్టరేట్ ఎదుట బీకేఎంయూ నాయకుల ధర్నా


సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీకేఎంయూ నాయకులు

మదనపల్లె టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలో పేద రైతుల పొట్టకొడుతున్న తహసీల్దార్ ఖాజాబీపై చర్యలు తీసుకోవాలని బీకేఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కృష్ణప్ప ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్ప మాట్లాడుతూ మదనపల్లె మండలంలో సన్న, చిన్నకారు రైతులను తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ వీఆర్‌వోలను అడ్డం పెట్టుకుని వేధిస్తున్నారని ఆరోపించారు. ముడుపులు చెల్లించిన వారికి మాత్రమే పనులు జరుగుతున్నాయన్నారు. ఈ నాలుగు నెలల్లో మదనపల్లె మండలంలో ఎన్ని మ్యుటేషన్స్ జరిగాయి, ఎంత అవినీతి జరిగిందో సబ్‌కలెక్టర్ సమగ్ర విచారణ చేయాలని కోరారు. సాంబశివ మాట్లాడుతూ గతంలో గుర్రంకొండలో పనిచేసినప్పుడు కూడా తీవ్ర ఆరోపణలు వచ్చాయని, తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌కలెక్టరేట్ ఇన్‌చార్జి డీఏవో రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీకేఎంయూ నాయకులు చంద్రశేఖర్, మురళి, హరి, సుశీల, నరసింహులు పాల్గొన్నారు.

'రిమ్స్' ప్రొఫెసర్లపై విచారణకు నోటీసులు

- ఆసుపత్రి కార్యాలయ సూపరింటెండెంట్‌పై కూడా...
- ఆరేళ్ల తరువాత విచారణపై కదలికలు

కలికిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప 'రిమ్స్' వైద్యశాల, రిమ్స్ వైద్య కళాశాలకు చెందిన ముగ్గురు వైద్యులు, ఒక బోధనాపరమైన అధ్యాపకుడు, మరో ఆసుపత్రి సూపరింటెండెంట్‌లపై విచారణకు ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. 2016లో రిమ్స్‌లో వెలుగులోకి వచ్చిన అవకతవకలపై ఏసీబీ విచారణ జరిపింది. దీనిపైన 2016 ఏప్రిల్ 16 సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఏసీబీ అందజేసిన నివేదికను పరిశీలించిన ప్రభుత్వం మొత్తం ఐదుగురిపై అభియోగాలు నమోదు చేసి వారి నుంచి 2018 అక్టోబరు 26న సంజాయిషీలు తెలుపుకోవడానికి అవకాశమిస్తూ నోటీసులు జారీ చేసింది. అప్పట్లో రిమ్స్ వైద్యశాల సాధారణ వైద్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎం.సురేశ్వరరెడ్డి, ఆర్థోపెడిక్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జొన్నా నగేష్, ఆసుపత్రి కార్యాలయం సూపరింటెండెంట్ లాల్‌బంద్ షేక్ మహబూబ్ బాషా, మరో ఆర్థోపెడిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సంజీవయ్య, రిమ్స్ వైద్య కళాశాల కంటి విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీడీఎల్ సత్యనారాయణలపై నమోదైన అభియోగాలను వివరిస్తూ ఈ సంజాయిషీ నోటీసులు జారీ అయ్యాయి.

పది రోజుల్లోగా వివరణలు ఇవ్వాలని గడువు విధించింది. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో వైసీపీ పాలన జరిగిన ఐదేళ్లూ ఆ తరువాత జరగాల్సిన విచారణ మూలనపడింది. తాజాగా ఈ వ్యవహారాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించి విచారణకు ఆదేశించింది. మొత్తం ఐదుగురినీ కలిపి విచారించి నివేదిక సమర్పించడానికి తిరుపతి రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవిప్రభును విచారణాధికారిగా నియమించింది. రెండు నెలల్లోగా విచారణ నివేదికను ప్రభుత్వానికి అందజేయాల్సిందిగా కూడా ప్రభుత్వం ఆదేశించింది. దీనికి సంబంధించిన అన్ని రికార్డులను విచారణాధికారికి అందచేయాలని వైద్య విద్య డైరెక్టరును ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి.హోస్‌మణి బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో


పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఈవో సుబ్రమణ్యం

నందలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రమణ్యం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన రిజిస్టర్‌లు, రికార్డులను పరిశీలించారు. తరగతి గదుల్లో జరుగుతున్న బోధన అభ్యాసన ప్రక్రియలు, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను ఉపాధ్యాయులకు సంబంధించి అకడమిక్ మానిటరింగ్ అంశాలను పర్యవేక్షించారు. పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పలు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం విద్యార్థులచే బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జీసీడీవో ఎస్.శశికళ, డీఈవో కార్యాలయ క్యాంప క్లర్కు ఎస్.హబీబ్, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎస్.రౌఫ్ బాషా, పాఠశాల ఉపాధ్యాయులు, నాన్‌టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు ప్రజల రుణం తీర్చుకుంటా

రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి


చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న కేకే చౌదరి

రైల్వేకోడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు ప్రజల రుణం తీర్చుకుంటానని రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి తెలిపారు. విజయవాడలో బుధవారం ఆయన చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్‌గా తాను ప్రజలకు ఏమి చేయగలనో అవన్నీ చేసి చూపిస్తామని తెలిపారు. నాపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లకు ఎలాంటి చెడ్డ పేరు తీసుకుని రాకుండా పరిపూర్ణమైన సేవలు ప్రజలకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమానికి టీడీపీ ఇన్‌చార్జ్, అడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, రైల్వేకోడూరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

- *క్రీడలతో మానసిక ఉల్లాసం...*
- *ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు*

రాయచోటి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయం సమీపంలో గల పోలీస్ పెరేడ్ మైదానంలో బుధవారం జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ ఫ్లాగ్‌ను ఎగురవేసి, స్టేట్ మీట్‌లో డెకాత్లాన్‌లోని 10 ఈవెంట్లలో వరుసగా మూడు సంవత్సరాలు గోల్డ్ మెడల్ సాధించిన హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య, రాష్ట్ర అథ్లెటిక్స్‌లో నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించిన ఉమెన్ పీసీ శశికళ ఎస్పీకి క్రీడా జ్యోతిని అందించగా ఎస్పీ క్రీడాజ్యోతిని వెలిగించి మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బందిలోని క్రీడా ప్రతిభను వెలికితీయడానికి పోలీసు స్పోర్ట్స్ మీట్ ఎంతో దోహదపుతుందన్నారు. ఆటలు ఓటమిని, కష్టాన్ని భరించే భక్తిని ఇస్తాయని, 24 గంటలు విధి నిర్వహణలో ఉండే పోలీసు సిబ్బందికి ఈ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు వారిలో ఉన్న క్రీడా ప్రతిభకు గుర్తింపు తీసుకువస్తుందన్నారు. జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర పోలీసు మీట్‌కు పంపిస్తామన్నారు. పిల్లల్ని కూడా గేమ్స్ ఎక్కువగా ఆడించాలన్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత మొట్టమొదటి సారిగా జిల్లాలో పోలీసు స్పోర్ట్స్ మీట్ జరుగుతోందని తెలిపారు. అలాగే 27, 28, 29 తేదీల్లో వరుసగా మూడు రోజుల పాటు సాగే ఈ స్పోర్ట్స్ మీట్‌లో 4 జోన్లకు సంబంధించిన నాలుగు టీమ్‌లు (రాయచోటి, మదనపల్లె, రాజంపేట, ఏఆర్ హెడ్ క్వార్టర్స్) కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్, 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగుపందెం, హైజంప్, లాంగ్‌జంప్, క్రికెట్, టెన్నిస్, షటిల్ మొదలగు క్రీడల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వెంకటాద్రి, రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, రాజంపేట డీఎస్పీ సుధాకర్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.





పోలీసు క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు - క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో పోలీసు క్రీడాకారులు

రహదారుల భద్రతకు పటిష్ట చర్యలు

- *కలెక్టర్ చామకూరి శ్రీధర్*


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రహదారుల భద్రత సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అజెండా అంశాలపై సమీక్షించారు. ఇందులో జూలై, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల ప్రమాద డేటా విశ్లేషణ, మూడు కంటే ఎక్కువ మరణాలపై ఉమ్మడి తనిఖీ అంశాలపై సమీక్షించారు.

ఇంటిగ్రేటెడ్ రోడ్డు యాక్సిడెంట్స్ అండ్ డెత్ డేటాపై సమీక్షించారు. వచ్చే ఏడాది 2024-25 కోసం జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల్లో బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి సరిదిద్దడానికి కార్యాచరణ ప్రణాళికను అమలు పరచడం, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం, హిట్ అండ్‌రన్ కేసుల బాధితులకు పరిహారం, గత రోడ్డు భద్రత సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు. ఇందులో 2023, 2024లో ఇప్పటి వరకు చోటు చేసుకున్న ప్రమాదాలపై సమీక్షించారు. 2023లో మొత్తం 593 ప్రమాదాలు జరగగా, ఇందులో 274 ప్రాణాంతకం కేసులు, 319 ప్రాణాంతకం కానివి, 314 మరణాలు, 786 మంది గాయపడినట్లు తెలిపారు. ఈ ఏడాది అక్టోబరు నెలాఖరు వరకు మొత్తం 533 ప్రమాదాలు జరగగా, ఇందులో 255 ప్రాణాంతకం కేసులు, 278 ప్రాణాంతకం కానివి, 289 మరణాలు, 656 మంది గాయపడినట్లు నివేదికలు సూచిస్తున్నాయని, ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

అత్యధిక శాతం రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. జనాభాతో పాటు వాహనాల వినియోగం కూడా పెరుగుతున్న నేపథ్యంలో రవాణా శాఖ, పోలీసు, అనుబంధ శాఖల అధికారులు, రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి వాహన ప్రమాదాలను అరికట్టే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్లు మేఘస్వరూప్, నిదియా దేవి, ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా రవాణా అధికారి ప్రసాద్, ఎంవీఐలు, పోలీసుశాఖ అధికారులు, డీఎస్పీలు, ఎన్‌హెచ్‌ఏఐ, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యం, విద్యుత్, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం హామీకి ఐదేళ్లు

- 2019 ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, జగన్ హామీలు
- ఎత్తిపోతల పథకంతో పంట పొలాలను సస్యశ్యామలం చేస్తామంటూ జగన్ గొప్పలు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో ఊసే లేని వైనం
- కూటమి ప్రభుత్వంపైనే రైతుల ఆశలు


గోపవరం మండలం బ్రాహ్మణపల్లె వద్ద సోమశిల వెనుక జలాలు (ఫైల్)

బద్వేలు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టుల నుంచి ప్రవాహం కాకుండా వృథాగా మిగిలిపోతున్న ప్రాజెక్టుల వెనుక జలాలను ఎత్తిపోతల పథకం (లిఫ్ట్ రిగేషన్) ద్వారా కాల్వలు, చెరువులకు నీటిని తరలిస్తే పంట పొలాలు సస్యశ్యామలం అవు తాయి. ఆ దిశగా సోమశిల ప్రాజెక్టు వెనుక జలాలను ఎత్తిపోతల పథకం ద్వారా బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాల చెరువులకు మళ్లిస్తే వాటి ఆయకట్టు కింద ఉన్న వేలాది ఎకరాల భూములు పచ్చని పంటలతో కళకళలాడే అవకాశం ఉంది. ఆ దిశగా నూత నంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవా లంటూ ఆయా మండలాల రైతులు కోరుతున్నారు.

గోపవరం మండలం బ్రాహ్మణపల్లె వద్ద ఉన్న సోమశిల వెనుక జలాల వద్ద ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తే దాదాపు గోప వరం, బద్వేలు, అట్లూరు మండలాల్లోని 36 చెరవులకు సాగు నీరందించే అవకాశం ఉంది. ఈ మూడు మండలాల్లోని చెరువులను నీటితో నింపినట్లయితే పంట పొలాలు సస్యశ్యామలంగా మారే అవకాశం ఉంది. దీంతో ఈ ప్రాంతంలోని రైతులు ఎత్తిపోతల పథకం నిర్మిస్తే తమ బతుకులు బాగు పడుతాయని ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఎన్నికల ప్రచారంలో హామీలు..

2019లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు స్థానిక ఎస్‌బీవీఆర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార బహిరంగ సభలో సోమశిల వెనుక జలాలను ఎత్తిపోతల పథకం ద్వారా మూడుమండలాల చెరువులకు సాగునీరు అందిస్తామని.. హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన జీవోలు కూడా జారీ చేశామని.. మళ్లీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు చేస్తామని తెలి పారు. అలాగే స్థానిక నెల్లూరు రోడ్డులోని ఇండియన్ పెట్రోలు బం కు వద్ద నిర్వహించిన జగన్ రోడ్‌షోలో తమ ప్రభుత్వం అధి కారం లోకి వస్తే సోమశిల వెనుకజలాలను ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులకు సాగునీరందించి పంట పొలాలను సస్యశ్యామలం చేస్తామని గొప్పగా హామీ ఇచ్చారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో ఊసే లేదు

2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. జిల్లా వాసి వైఎస్ జగన్ సీఎం కావడంతో ఎత్తిపోతల పథ కంపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్నా ఎత్తిపోతల పథకం ఊసే లేకుండా పోయింది. వైసీపీ ప్రభుత్వానికి బద్వేలు నియోజకవర్గం మరో పులివెందులగా నిలచినప్పటికీ ఈ ప్రాంత రైతాంగానికి జగన్ ఐదేళ్ల అధికారంలో ఉన్నా హామీ అమలుపరచలేకపోయారు.

ఎత్తిపోతల పథకంపై పోరాటాలు

బ్రాహ్మణపల్లె సమీపంలోని సోమశిల వెనక జలాల వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించాలంటూ 2018లో సోమశిల ఎత్తిపోతల సాధన సమితి ఏర్పాటు చేసి పలుమార్లు పోరాటాలు సాగించారు. ఇందులో భాగంగా సోమశిల వెనక జలాల వద్ద నుంచి బద్వేలులోని నాలుగు రోడ్ల కూడలి వరకు పాదయాత్ర నిర్వహించారు. వారి పోరాటాల ఫలితంగానే అప్పట్లో ఇరుపార్టీల అధినేతలు ఎత్తిపోతల పథకం అవశ్యకత గుర్తించి హామీలు ఇచ్చారు. దీంతో గత వైసీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకం నిర్మిస్తుందని ఐదేళ్లుగా ఎదురు చూసినా ఫలితం లేదు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

2019 ఎన్నికల ప్రచారంలో అప్పటి సీఎం చంద్రబాబు సోమశిల ఎత్తిపోతల పథకంపై హామీ ఇవ్వడం.. అనంతరం జరిగిన ఎన్నికల్లో అధికారం కోల్పోవడం జరిగింది. తిరిగి 2024 ఎన్నికల్లో చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఆనాటి హామీని గుర్తుంచుకుని చంద్రబాబు సోమశిల ఎత్తిపోతల పథకం నిర్మిస్తారని కూటమి ప్రభుత్వంపై రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

పిల్లలున్నా.. అనాథగా వృద్ధుడు మృతి

మదనపల్లె అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అందరూ ఉన్నా.. అనాథగా ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చోటుచేసుకుంది. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసుల వివరాల మేరకు.. స్థానిక అనిబిసెంట్ సర్కిల్ సమీపంలో రోడ్డుపక్కనే ఓ వృద్ధుడు మృతి చెందాడు. మదనపల్లె జిల్లా ఆసుపత్రి సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. అనంతరం వృద్ధుడి జేబులోని అతని పేరు నరసింహులుగా గుర్తించారు. తన వద్ద ఉన్న ఫోన్‌నెంబరు సహాయంతో పోలీసులు విచారించగా మదనపల్లె మండలం, చీకలబైలు గ్రామం, బార్లపల్లె సమీపంలోని కోళ్లలోలపల్లెగా గుర్తించారు. ఇత నికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నట్లు తెలిసింది. కాగా స్థానికులు జిల్లా ఆస్పత్రి వద్దకు మధ్యాహ్నం వచ్చి అతనికి మతిస్థిమితం సరిగాలేదని, కుమార్తె మదనల్లె పట్ట ణం, బాలాజీ కాలనీలో ఉందని తీసుకొస్తామని ఆస్పత్రి నుంచి వెళ్లిపోయారు. అనంతరం ఆస్పత్రి సిబ్బంది సాయంత్రం వరకు చూసి ఎవ్వరూ రాకపోవడంతో వృద్ధుడి మృతదేహాన్ని మార్చురీకి తర లించారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

కలకడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనుగొండపాళెం పంచాయతీ గుండావాండ్లపల్లె వద్ద ఈ నెల 24వ తేదీ జరిగిన రోడ్డు ప్రమాదంపై బుధవారం కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ రమేశ్ తెలిపారు. గుర్రంకొండ మండలం చెర్లోపల్లె పంచాయతీ ఎగువతొట్లివారిపల్లెకు చెందిన ఆదినారాయణ, గుండావాండ్లపల్లె సమీపంలో పొలం లీజుకు తీసుకుని టమోటా సాగు చేస్తున్నాడు. అతను తన ద్విచక్ర వాహనంలో ఆ పొలం వద్దకు వస్తుండగా 24వ తేదీ ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఆ ప్రమాదంలో ఆదినారాయణకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబసభ్యులు అతనిని చికిత్స కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అతని ద్వారా జరిగిన సంఘటన తెలుసుకున్న అతని తండ్రి బాలయ్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ సునీల్ కుమార్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాలిక అదృశ్యం.... కేసు నమోదు

మదనపల్లె అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. మొలకలచెరువు మండలం, యర్రంరెడ్డిగారిపల్లెకు చెందిన అడపా సిద్దయ్య, మంజుల దంపతుల కుమార్తె(17) తిరుపతి నుంచి తమ సొంత ఊరుకు వెళ్లడానికి బస్సులో బయలుదేరింది. మదనపల్లెకు వచ్చి అక్కడ నుంచి అదృశ్యం అయ్యింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

టీడీపీ సభ్యత్వ నమోదులో రాజంపేటకు అగ్రస్థానం

- సుగవాసికి సీఎం చంద్రబాబు అభినందన

రాజంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశంపార్టీ సభ్య త్వ నమోదులో రాజంపేట నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానం సాధించడంపై తెలుగుదేశం పార్టీ అధిష్టానం ప్రశంసలు కురిపించింది. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాల సుబ్రమణ్యంను టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభినందించారు. ఇప్పటివరకు 96, 600 సభ్యత్వాలు పూర్తి చేయడంపై అభినందనలు తెలిపారు. బుధ వారం మధ్యాహ్నం రాష్ట్రంలోని 30వేల మంది పార్టీ కార్య కర్తలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, తదితరులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో సభ్యత్వాల నమోదుపై సమీక్షించారు. సుగవాసి బాలసుబ్రమణ్యం నేతృత్వంలో కేవలం ఒక నెలలోనే లక్ష సభ్య త్వాలు పూర్తి చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో రాజంపేటతో పాటు కుప్పం, కల్యాణదుర్గం, పాలకొల్లు, ఆత్మకూరు, మంగళగిరి, కనిగిరి, కోడూరు, వినుగొండ, కావలి, కోడూరు నియో జకవర్గాలు టాప్‌టెన్‌లో ఉన్నాయని, అక్కడి నాయకత్వాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు చంద్రబాబునాయుడు తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 52 లక్షల సభ్యత్వాలను పూర్తి చేయించడంపై రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేష్‌ను అభినందించారు.

అన్నమయ్య జయంతిని ఘనంగా నిర్వహిస్తాం

- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు హామీ

రాజంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జన్మస్థలమైన తాళ్లపాకను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, గ్రామంలోని ఆల యాల అభివృద్ధికి చర్యలు తీ సుకోవాలని రాష్ట్ర బీజేపీ కార్య దర్శి నాగోతు రమేష్ నాయు డు తదితరులు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును కోరారు. బుధవారం వారు టీటీడీ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యలను తెలుసుకోవడానికి, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహనతోపాటు స్థానిక ప్రజలతో చర్చించడానికి తాళ్లపాకలో పర్యటించాలని కోరారు. ఇందుకు స్పందించిన బీఆర్ నాయుడు తాళ్లపాక అన్నమయ్య జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొల్లపాటి మహేంద్ర, దగ్గుపాటి నరసింహులు తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థులకు ఏపీజీబీ ప్రోత్సాహకాలు

నందలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ప్రతిభా వం తులైన ముగ్గురు పేద బాలికలకు ఒక్కొక్కరికి 5 వేల రూపాయల చొప్పున బుధవారం ఏపీజీబీ ప్రగతి విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా నందలూరు ప్రగతి గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ జాహ్నవీధర్ మాట్లాడుతూ తమ బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశానుసారం పేద విద్యార్థినులైన వైష్ణవి, శివప్రసన్న, హర్షనందినిలకు ఆర్థికంగా సహకారం అందజేశామన్నారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వర్ణ పంచాయతీల లక్ష్యాలను నెరవేర్చాలి

సిద్దవటం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణ పంచాయతీల లక్ష్యాలను నెరవేర్చాలని డీపీవో రాజ్యలక్ష్మి ఆదేశించారు. బుధవారం మండలంలోని మాధవరం-1 గ్రామ సచివాలయాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్ణ పంచాయతీ సర్వేలు పక్కాగా చేయాలన్నారు. కార్య దర్శులు ఇంటి పన్ను, నాన్ టాక్స్‌లను పరిశీలించి 30వ తేదీ లోపు అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారి మెహతాజ్ యాస్మిన్, కార్యదర్శి లక్ష్మీనరసయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏహెచ్ఏలను పశుసంవర్ధకశాఖలో విలీనం చేయాలి


పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శారదమ్మకు వినతి పత్రం అందజేస్తున్న రాజశేఖర్ తదితరులు

కడప రూరల్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న (ఏహెచ్ఏ) వారిని పశుసంవర్ధకశాఖలో విలీనం చేయాలని ఏపీఎన్జీఎఫ్ జిల్లా చైర్మన్ నంద్యాల రాజశేఖర్, నేతలు గణపతిరెడ్డి, ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం పశుసంవర్ధకశాఖ జిల్లా అధి కారి శారదమ్మను కలిసి వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడుతూ ఏహెచ్ఏల సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు. పశుసంవర్ధకశాఖకు సంబంధంలేని అదనపు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని సూచించగా శారదమ్మ సానుకూలంగా స్పందించారన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నేతలు ఆరిఫ్, ఇమ్మానుయేల్, శివయ్య, హిమజ, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో రేఖామునికి కాంస్యపతకం



కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైవీయూకు చెందిన రేఖాముని అనే పీజీ విద్యార్థిని అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో కాంస్య పతకం సాధించింది. నాగార్జున యూనివర్శిటీలో జరుగుతున్న దక్షిణ, పశ్చిమ భారత అంతర్ విశ్వ విద్యాలయాల వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రేఖాముని 45 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఈమె సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో పీజీ మొదటి సంవత్సరం చదువు తున్నా రు. రేఖామునిని వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, వ్యాయామ విద్య సంచాలకులు సుబ్బారెడ్డిలు అభినందించారు.

మధ్యాహ్నభోజనంలో నాణ్యత పాటించాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ మీనాక్షి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఈఓ మీనాక్షి తెలి పారు. బుధవారం కడప నగరం మున్సిపల్ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజనాన్ని మరింత మెరుగ్గా చేయాలని సూచించారు. టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పనిచేయాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, ఖాజాపీర్, అయూబ్ పాల్గొన్నారు.

జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలి



ఐటీఐ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పీఆర్ఎస్ వైఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం (పీఆర్ఎస్ వైఎఫ్) జిల్లా కన్వీనరు ఓ.నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం ఐటీఐ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాయలసీమ కరువు ప్రాంతంగా మారి రైతుల ఆత్మహత్యలకు నిలయమైందన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, వేణు, అనిల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాల్యవివాహ రహిత దేశంగా చూడటమే లక్ష్యం


ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా అధికారులు

కడప కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహ రహిత దేశంగా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి అన్నపూర్ణదేవి పిలుపు నిచ్చారు. బుధవారం కలెక్టరేట్ లోని వీసీ హాలులో బాల్య వివాహ ముక్త్ భారత్ ప్రతిజ్ఞ, ప్రచార కార్యక్రమం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగింది. కలెక్టర్ శ్రీధర్ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఐసీడీఎస్ అధికారిణి శ్రీలక్ష్మీతో పాటు అధికారులు పాల్గొన్నారు. న్యూఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని.. వివాహ వయసుపై అవ గాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాలిక లకు మంచి విద్యను అందించే బాధ్యత తల్లిదండ్రులదన్నారు. మహిళలు అనేక రంగాలలో రాణిస్తున్నారని.. అందుకే సుప్రీం కోర్టు ఆదేశానుసారం కేంద్ర ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని రూపొ ందించి.. అన్ని శాఖల సమన్వయంతో బాల్య వివాహ రహిత దేశంగా తయారు చేయటానికి ప్రధాని ఆధ్వర్యంలో పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా అధికారులు ఆనంద్ నాయక్, మీనాక్షి తదితరులు పాలొన్నారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

105 గ్రాములు బంగారు, 116 గ్రాముల వెండి రికవరీ


వివరాలు వెల్లడిస్తున్న సీఐ జీవన్ గంగానాథ్‌బాబు

పులివెందుల టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీలో విశ్వనాథరెడ్డి అనే ఉపాధ్యాయుడి నివాసంలో జూలై 17న జరిగిన చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ జీవన్ గంగానాథ్‌బాబు తెలిపారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. పులివెందుల చెన్నారెడ్డికాలనీకి చెందిన విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యులు సొంత పని నిమిత్తం కడపకు వెళ్లగా ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న 105 గ్రాముల బంగారు, 116 గ్రాములు వెండి వస్తువులను దొంగలించారన్నారు. అప్పట్లో కేసు నమోదు చేసి జిల్లా ఎస్పీ, డీఎస్పీ మురళీ ఆదేశాల మేరకు రెండు టీంలుగా విడిపోయి దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ముద్దనూరు రింగు రోడ్డు సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న లింగుభేరి రాంబాబు, నడింపల్లి గోపి, సోనుకుమార్ రాయ్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. వారి వద్ద నుంచి 105 గ్రాముల బంగారు, 116 గ్రాములు వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, రావు రమేశ్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ప్రైవేటు హాస్పిటల్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం

- రూ.2లక్షల మేర ఆస్తినష్టం


సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి

కడప క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం శంకరాపురంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరే గడంతో ల్యాబ్‌లోని వస్తువులు కాలిపోయాయి. ఫైర్ స్టేషన్ సిబ్బంది వివరాల మేరకు... కడప శంకరాపురంలోని డాక్టర్ మామిళ్ల నాగప్రశాంత్ ఆస్పత్రిలో బుధవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి, కడప ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో దాదాపు రూ.2లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు ఆసుపత్రి యాజమాన్యం ఫిర్యాదు చేసింది.

మంచు కురిసే వేళ...


ఇటు తుఫాన్ ప్రభావం, నవంబరు నెల ఆఖరు కావడంతో బుధవారం ఉదయం 7 గంటల సమయంలో పంటపొలాలపై మంచు కురవడంతో దుప్పటిలా అలుముకుంది. ఈ దృశ్యం రబీలో సాగు చేసిన శనగ పంటపై ఆహ్లాదకరంగా మారింది. చూపరులను ఆకట్టుకుంది.
- రాజుపాళెం, ఆంధ్రజ్యోతి

అపార్ సమస్యలు అధిగమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

పెద్దమండ్యం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యా శాఖలో విద్యార్థులకు అపార్ ఐడీలు నమోదు సమస్యలను అధిగమించాలని పెద్దమండ్యం ఎంపీడీవో శ్రీధర్‌రావు వెల్లడించారు. పెద్దమండ్యం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల శాఖ అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హౌసింగ్ ఏఈ అక్రం మట్లాడుతూ ఈ నెల 30వ తేది లోపు స్థలం వున్న అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జీఎస్ సిబ్బంది, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అపార్ ప్రక్రియను పూర్తి చేయాలి

ములకలచెరువు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అపార్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో హరినారాయణ ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాలతో బుధవారం అపార్‌పై పంచాయతీ కార్యదర్శులు, పాఠశాలల హెడ్మాస్టర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంఈవో వెంకటరమణ, ఈవోఆర్డీ మోహన్‌ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: అపార్ అప్డేట్ వంద శాతం పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీ కార్యదర్శి వారి పరిధిలోని పాఠశాలల హెచ్‌ఎంలు ఇచ్చిన విద్యార్థుల జాబితాను పరిశీలించి జనన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సుజాత, ఈవోఆర్డీ దిలీప్‌కుమార్‌నాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా అధిక ఆదాయం : డాక్టర్ మంజుల

కలికిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వివిధ పంటల నుంచి విలువ ఆధారితలను జోడించి తయారు చేసే ఉత్పత్తులతో అధిక ఆదాయాన్ని పొందవచ్చని కలికిరి కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల సూచించారు. రైతులు పండించే మామిడి, టమోట, వేరుశెనగ, బొప్పాయి, పాలుతో పాటు ఇతర చిరుధాన్యాలు, పండ్లు, ఆకుకూరలతో అనేక రకాల ఉత్పత్తులను, పదార్థాలను తయారు చేయవచ్చని చెప్పారు. దీని కోసమే ఆసక్తి కలిగిన వారికి విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసేందుకు అవసరమైన శిక్షణ అందించేందుకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. బుధవారం కేవీకేలో ఈ ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని కోఆర్డినేటర్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల మహిళలు, యువతీ యువకులు విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి వ్యాపారం చేయడం ద్వారా అధిక లాభాలను పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంతోనే ముందుకెళ్తాం



సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

వాల్మీకిపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం, అభివృద్ధితోనే ముందుకెళ్తామని నియోజకవర్గ టీడీపీ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ కమిటీ సమావేశ భవనంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డితో కలిసి ఆయన టీడీపీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలు, నాయకులకు తాము అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వాల్మీకిపురంలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి కార్యక్రమాలన్ని పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పీలేరు మైనార్టీ నాయకులు సయ్యద్‌బాషా, టీడీపీ నాయకులు గాంధీపేట రమణ, మాజీ సర్పంచ్ రాజేంద్రచారి, పీవీ.మురళి, సైదు, యూసఫ్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలి



దుస్తులను అందజేస్తున్న దృశ్యం

కురబలకోట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సేవా గుణాలను అలవర్చుకోవాలని ప్రిన్సిపల్ యువరాజ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్, మిట్స్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో వెలుగు అనాథాశ్రమానికి దుస్తులను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శరణాలయానికి 281 జతల దుస్తులను అందజేశారన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పారిశుధ్యం.. పరిహాసం..!





కొండమీద పర్యాటకులు అమితంగా ఇష్టపడే ప్రదేశంలో కుప్పతొట్టి, హార్సిలీహిల్స్‌లోని గాలిబండపై ప్రవహిస్తున్న మురికినీరు

- హార్సిలీహిల్స్‌లో టౌన్‌షిప్ కమిటీ పర్యవేక్షణ ఉందా ?
- ప్రైవేటుకు పాలకమండలి దాసోహం ?

బి.కొత్తకోట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం, ఆంధ్రా ఊటీగా పేరు గడించిన హార్సిలీహిల్స్‌లో పారిశుధ్యం.. పరిహాసంగా మారింది. సాధారణంగా ఎన్నో ఒత్తిడిలతో సేద తీరేందుకు హిల్స్‌కు వెళుతుంటారు. కానీ ఇక్కడ చూస్తే పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. చెత్తకుప్పలు, మురికినీరు, దుర్వాసనతో పర్యాటకులు అసహ్యించుకునే దుస్థితి నెలకొంది. సాక్షాత్తూ సబ్‌కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించే టౌన్‌షిప్ కమిటీ పాలనలో వుండే హార్సిలీహిల్స్‌లో పారిశుధ్యం దయనీయ స్థితిలో వుంది. రెండు మూడు రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు తరచుగా వచ్చే హిల్స్‌పై చూడ ముచ్చటైన ప్రదేశాలు, ఆహ్లాదకరమైన వాతావరణానికి తోడు పారిశుధ్యం అవసరం. కానీ ఇక్కడ అలాంటి పరిస్థితి లేదని తెలుస్తోంది.

కొండపై అజమాయిషీ అంతా టౌన్‌షిప్ కమిటీయే చూస్తుంది. ఇటీవల కొండమీదకు వెళ్లే వాహనాల నుంచి ఏడాది పాటు టోల్ వసూలు చేసే హక్కును వేలం వేయగా రూ.46 లక్షలకు పైగా పలికింది. ఈ సొమ్మంతా టౌన్‌షిప్ కమిటీ ఖాతాలోకే వెళుతుంది. అయితే ఇదే కమిటీ ప్రధాన కార్యాలయం వద్ద కూడా పారిశుధ్యాన్ని కాపాడుకోలేని దుస్థితిలో పాలకమండలి ఉండడం దారుణం. హిల్స్‌పైకి వచ్చిన పర్యాటకులు ప్రధానంగా చూసే ప్రదేశం గాలిబండ. ఈ బండ ఏకంగా మూడు ఎకరాల విస్తీర్ణంలో వుంటుంది. బండ కింది భాగంలో 4 వేల అడుగుల లోతులో కనిపించే అటవీప్రాంతం ఏరియల్ వ్యూ చూపరులను కట్టిపడేస్తుంది. పర్యాటకులు ఎక్కువ సమయం ఇక్కడే గడపడానికి ఆసక్తి చూపుతారు. రాత్రిళ్లు ఇక్కడ బసచేసి ఎంజాయ్ చేసే వారు గాలిబండపైనే సేదతీరుతారు. అలాంటి గాలిబండ ముఖద్వారం నిర్వహణ నవ్వుల పాలవుతోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన కుప్పతొట్టి దుస్థితిని ఎత్తిచూపుతోంది. దీనికి తోడు గాలిబండ సమీపంలో వున్న ఓ ప్రైవేటు రెస్టారెంట్ నుంచి మురుగునీరు ప్రవహిస్తోంది. తక్షణం సంబంధిత అధికారులు స్పందించాల్సి వుందని పలువురు కోరుతున్నారు.

సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

- అర్హులకు త్వరలోనే మూడు సెంట్ల స్థలం
- ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి



గూడరేవుపల్లెలో స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

పీలేరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియపై బుధవారం ఆయన పార్టీ శ్రేణులతో స్థానిక పార్టీ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి గతంలో రూ.2 లక్షల ప్రమాద బీమా సదుపాయం ఉండేదని, దాన్ని ప్రస్తుతం రూ.5 లక్షలకు పెంచారన్నారు. కేవలం రూ.100లు చెల్లించి రెండేళ్లపాటు బీమా సదుపాయం పొందవచ్చన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సభ్యత్వ నమోదులో పీలేరు నియోజకవర్గం అన్నమయ్య జిల్లాలో ప్రథమ స్థానంలో ఉండేదని, ఆ స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. 70 వేలకు తగ్గకుండా సభ్యత్వం చేయించాలన్నారు. పీలేరు పట్టణంలోని పేదల కోసం త్వరలోనే మూడు సెంట్ల స్థలం కేటాయించనున్నట్లు ఆయన ప్రకటించారు. అనంతరం ఆయన కాలనీల నిర్మాణానికి అనువైన స్థలాల కోసం గూడరేవుపల్లె, దొడ్డిపల్లె పంచాయతీల్లో రెవెన్యూ అధికారులతో పర్యటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వారణాశి శ్రీకాంత్‌రెడ్డి, అమరనాథరెడ్డి, కోటపల్లె బాబురెడ్డి, మల్లెల రెడ్డిబాషా, పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర, ఆతిఖా షఫీ, కోటపల్లె శ్రీనాథరెడ్డి పాల్గొన్నారు.

కలకడ: మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిలు బుధవారం మండలంలో పర్యటించి అనుచరుల యోగక్షేమాలను తెలుసుకున్నారు. మొదట మాజీ సీఎం పాపిరెడ్డిగారిపల్లెలో సీనియర్ నాయకుడు వంగిమళ్ల రాజారెడ్డి ఇంటికి వెళ్లి ఆరోగ్యం గురించి వాకబు చేశారు. అనంతరం అన్నదమ్ములిద్దరూ కలిసి మండలంలోని పలు శుభకార్యాలకు వెళ్లడంతో పాటు పలువురిని కలిసి పరామర్శించారు. వీరి వెంట కూటమి నాయకులు నిఖిలేష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసులరెడ్డి, బివిస్వామి, రెడ్డెప్పరెడ్డి, పుష్పాహాస్, బసినాయుడు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ పాడె మోసిన ఎమ్మెల్యే



మాజీ సర్పంచ్ పాడెమోస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్, నవంబరు27(ఆంధ్రజ్యోతి):టీడీపీ నాయకులు, కురవంక మాజీ సర్పంచ్ మోహన మంగళవారం అనారోగ్యంతో బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా బెంగళూరు ఆస్పత్రి వద్దకు వెళ్లి మోహన కుటుంబసభ్యులను పరామర్శించారు. రాత్రి కురవంకలోని నివాసం వద్ద మోహన పార్థివదేహానికి నివాళులర్పించారు. కురవంకలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు మోహన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బుధవారం మధ్యాహ్నం నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొని ఎమ్మెల్యే, మదనపల్లె టౌన్ బ్యాంకు చైర్మన్ నాదేళ్ల విద్యాసాగర్ మాజీ సర్పంచ్ పాడెను మోశారు. కార్యక్రమంలో కురబ సంఘం రాష్ట్రనాయకుడు బిల్లే రెడ్డిప్రసాద్, జేసీబీ వేణు, జనసేన నేత శ్రీరామరామంజనేయులు, నాగార్జునబాబు, మధుసూదనరెడ్డి, చిప్పిలి గురునాథ్, పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గోకులాల నిర్మాణాలు వేగవంతం చేయండి

తంబళ్లపల్లె, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలంలో గోకులాల నిర్మాణాలు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏపీవో అంజినప్పతో కలసి ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 49 గోకులాలు మంజూరయ్యాయని, వీటిని లబ్ధిదారులు సకాలంలో నాణ్యతగా పూర్తి చేసే విధంగా చూడాలన్నారు. ఉపాధిలో కూలీల సంఖ్యను పెంచడంతో పాటు వ్యవసాయాధారిత పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'కురబలందరినీ ముందుకు తీసుకెళ్తాం'

వాల్మీకిపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కురబలందరినీ ఐక్యంగా ముందుకు తీసుకెళ్లేందుకు తమవంతు కృషి చేస్తామని టీడీపీ రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వల్లిగట్ల వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర రాజధాని అమరావతి ప్రాంతంలోని గొల్లపూడి బీసీ సంక్షేమ భవన్‌లో రాష్ట్ర కురబ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన దేవేంద్రప్ప బీసీ కార్పొరేషన్ ఈడీ తనూజలను ఆ శాఖ డైరెక్టర్లతో కలిసి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ కార్పొరేషన్ డైరెక్టర్లు ఉయ్యాల రమణ, సుబ్రహ్మణ్యంగౌడ్, కురబ సంఘం నాయకులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్

పెద్దతిప్పసముద్రం,నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం పాఠశాలల్లో మెనూప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్ సూచించారు. బుధవారం ఆయన ఎంఈఓ నారాయణతో కలసి కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, రాజీపడే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో శైలజ, రంగసముద్రం పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్‌లతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లోనే 'అపార్' శిబిరాలు నిర్వహించాలి

పీలేరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోనే 'అపార్' కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఎస్ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృతతేజ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో బుధవారం విలేఖరులతో మాట్లాడారు. ఈ మేరకు ఆయన ఎంఈవో లోకేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలి

పీలేరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలని మేకలు, గొర్రెల పెంపకందారుల సంక్షేమ సంఘం రాష్ట్ర మారాణి వేంకటనారాయణ, కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు విజ్ఞప్తి చేశారు. కేవీపల్లె మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్‌కు ఆయన తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సుమారు 10 లక్షల కుటుంబాలు గొర్రెలు, మేకల పెంపకాన్ని ప్రధాన వృత్తిగా చేసుకుని జీవనం సాగిస్తున్నాయన్నారు. పశుసంపదను రక్షించడానికి పశువైద్యుల కొరత ఉందని, దీనివల్ల జీవాలకు వేయాల్సిన టీకాలు, మందుల విక్రయాలపై నియంత్రణ లేకుండా పోయిందన్నారు. కాగా పెంపకందారుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యత లోపించరాదు



గోకులాల నిర్మాణాలను తనిఖీ చేస్తున్న క్వాలిటీ కంట్రోలర్

తంబళ్లపల్లె, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామి పథకంలో బాగంగా చేపడుతున్న గోకులాలు, సీసీ రోడ్లు తదితర నిర్మాణపు పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని క్వాలిటీ కంట్రోలర్ ఉమామహేశ్వర్ హెచ్చరించారు. బుధవారం ఆయన ఉపాధి ఇంజనీర్ రామన్నతో కలసి తంబళ్లపల్లె, రేణుమాకులపల్లె, కుక్కరాజుపల్లె, రెడ్డికోట గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్లు, గోకులాల నిర్మాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో పల్లెపండుగ కార్యక్రమంలో బాగంగా మంజూరైన సీసీ రోడ్లు, గోకులాల నిర్మాణాలను నాణ్యతతో వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు శంకర, వెంకట్రమణ, శేఖరమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తంబళ్లపల్లె, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరిత్యా నేరమని, చిన్న వయసులో పెళ్లి చేయడం వలన బాలికల విద్య, ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని ఏఎస్‌ఐ నజీర్‌బాషా అన్నారు. బుధవారం ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో తంబళ్లపల్లెలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు చేయడం వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. అనంతరం కూటమి నాయకులు, అధికారులతో కలసి బాల్య వివాహ రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, పీసీ మణినాయక్, టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్దమ్మ, సోముశేఖర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, నరసింహులు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి: బాల్య వివాహిత రహిత ఏపీగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. బాల్య వివాహలు ఒక సాంఘిక దురాచారమన్నారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో రమేష్, ఈవోపీఆర్డీ చలపతిరావు, మండల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కురబలకోట: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఎంపీడీవో గంగయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బాల్య వివాహ ముక్త భారత్ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనకు సంబంధించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. .

ఎఫ్‌పీవో కేంద్రాల ద్వారా రైతులకు లాభాలు

పెద్దతిప్పసముద్రం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎఫ్‌పీవో కేంద్రాల ద్వారా రైతులు మరిన్ని లాభాలను గడించవచ్చని గుంటూరు జిల్లా ప్రత్యేక అధికారి జి.ఆండాల్ పేర్కొన్నారు. బుధవారం ఆమె పీటీఎం మండలం కుమ్మరవారిపల్లె సమీపంలో ఉన్న ఎఫ్‌పీవో (ఫార్మర్ ప్రోడ్యూజింగ్ ఆర్గనైజేషన్) కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చరల్ అధికారి రవిచంద్రబాబు, ములకలచెరువు హార్టికల్చరల్ అధికారి టీమేష్, వాసుదేవరెడ్డి, రాఘూరివాండ్లపల్లె వీహెచ్‌ఏ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్టెలో పడి వృద్ధురాలు మృతి



మృతి చెందిన వృద్ధురాలు ఫాతిమా

వాల్మీకిపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్త ఇందిరమ్మ కాలనీకి చెందిన ఫాతిమా(75) కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ఒంటరిగా జీవిస్తోంది. ఫాతిమాకు వృద్ధాప్యం ఉండడంతో నడకతో పాటు చూపు కూడా సరిగ్గా లేదు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున ఇందిరమ్మ కాలనీ సమీపంలోని నీటి తొట్టెలో ప్రమాదవశాత్తు పడిపోయింది. విషయం తెలుసుకున్న బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని బయటకు తీశారు. అప్పటికే వృద్ధురాలు మృతి చెందింది.

జూదరుల అరెస్టు

గుర్రంకొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జూదరులపై పోలీసులు దాడులు చేసి 14 మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మధురామచంద్రుడు తెలిపారు. మండలంలోని ఎల్లుట్ల హంద్రీనీవా కాలువ సమీపంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 14 మంది జూదరులు పట్టుబడగా వారి వద్ద నుంచి రూ.42,750 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడికి గాయాలు

మదనపల్లెఅర్బన్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): కుక్క దూరడంతో స్కూటర్‌పై వెళుతున్న యువకుడు కిందపడి గాయాలయ్యాయి. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసుల వివరాల మేరకు.. నీరుగట్టువారిపల్లెకు చెందిన రాజబాబు రామరావుకాలనీ వద్ద ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా స్కూటర్‌కు అడ్డుగా కుక్క వచ్చింది. దీంతో ఆ యువకుడు కిందపడి గాయాలపాలయ్యాడు. కాగా స్థానికులు యువకున్ని చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మరో రోడ్డు ప్రమాదంలోనూ...

మదనపల్లె అర్బన్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో యువకుడికి గాయాలైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం రామసముద్రం మండలం, మూగవాడికి చెందిన చిన్నమునెప్ప కుమారుడు జయరాం.. తన కుమార్తె అమృతను స్కూటీలో అంగళ్లు సమీపంలోని గోల్డన్‌వ్యాలీ కళాశాలకు తీసుకెళ్తున్నాడు. చంద్రకాలనీ సమీపంలోకి రాగానే బులోరా ఢీకొట్టడంతో కాలు విరిగింది. వెంటనే స్థానికుల సాయంతో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రెండు నెలల పింఛన్లు ఒకేసారి పంపిణీ

కలికిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాల వల్ల నవంబరు నెలలో పింఛను తీసుకోని వారికి డిసెంబరు పింఛను సొమ్ముతో కలిపి రెండు నెలల మొత్తాన్ని ఒకేసారి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో భానుమూర్తిరావు తెలిపారు. డిసెంబరు 1న ఆదివారం సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే శనివారం పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఒక వేళ శనివారం పింఛన్లు తీసుకోని వారికి ఆ తరువాత సోమవారం పంపిణీ చేస్తామన్నారు.

సీజనల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

వాల్మీకిపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ జ్వరాలు వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి శ్రీవిద్య పేర్కొన్నారు. బుధవారం వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి పంచాయతీ ఎన్టీఆర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి జ్వర పీడితులను గుర్తించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఇందిర, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

మదనపల్లెటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో సోలార్ విద్యుత్ పథకం పోస్టర్లను ఈఈ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఈ పథకం ద్వారా లబ్ధిదారుడికి రూ.78,000 సబ్సిడీ వస్తుందన్నారు. పట్టణ ప్రజలు ఈ పథకాన్ని ఉపయోగించుకుంటే విద్యుత్ చార్జీలు 90 శాతం తగ్గుతాయన్నారు. ఇంటికి అవసరమైన సోలార్ విద్యుత్‌ను ఉపయోగించుకుని మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ హరికుమార్, ఏఈ ముజమ్మిల్, ఉత్తన్న, సోలార్ ప్రతినిధి అల్లాబక్ష్ పాల్గొన్నారు.